
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి 5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
శుక్రవారం 8 మార్చి 2024



ఓం నమఃశివాయ!

- నేడు శివరాత్రి పర్వదినం
- ముస్తాబైన శైవక్షేత్రాలు



నెల్లూరు : విద్యుద్దీప వెలుగుల్లో శోభిల్లుతున్న మూలస్థానేశ్వర ఆలయం



రావణుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షిస్తున్న ఆదిదంపతులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 7 : శివరాత్రి పర్వదిన వేడుకలకు జిల్లా ముస్తాబయ్యింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శైవక్షేత్రాల్లో శుక్రవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరగనున్నాయి. బోళా శంకరుడైన శివుడి కృప పొందాలని ప్రతి ఒక్కరూ ముక్కంటిని ఆరాధిస్తారు. అలాగే ఆదిదంపతుల కల్యాణం కూడా జరగనుంది. మహాశివరాత్రి ఘడియలు శుక్రవారం రాత్రి 9.57 గంటలకు ప్రారంభమై శనివారం మధ్యాహ్నం 12.55 గంటలకు వరకు ఉంటాయి. శివరాత్రి రోజున భక్తులు జాగరణ చేసి అభిషేకం, రుద్రాభిషేకం, శివనామస్మరణలు చేస్తారు. నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి ఆలయం, రామతీర్థం, గండవరం ఉదయకాళేశ్వర స్వామి, కాటేపల్లి శ్రీకామాక్షి సమేత చంద్రశేఖర స్వామి, మైపాడు, కోదూరు, కృష్ణపట్నం సిద్ధేశ్వర వేణుగోపాల స్వామి, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, భైరవకోన, జొన్నవాడ కామాక్షితాయి ఆలయం ఇలా అన్ని శైవక్షేత్రాలలో శివరాత్రి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. కాగా, గురువారం రాత్రి నెల్లూరులోని మూలస్థానేశ్వర ఆలయంలో ఆదిదంపతులు రావణుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.



బ్రహ్మోత్సవాల గోడపత్రికలు ఆవిష్కరించిన చైర్మన్ శ్రీనివాసులు, ఆర్డీవో మాలోల, తదితరులు

20 నుంచి రంగడి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 7: నెల్లూరులోని తల్పగిరి రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు ఆర్డీవో మాలోల తెలిపారు. గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మహిళలకు భద్రత, ట్రాఫిక్ నియంత్రణతోపాటు బ్రహ్మోత్సవాల్లో శాంతిభద్రతలను పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు. ఆలయం లోపల, బయట భక్తులకు చలివేంద్రాలు, వీధిదీపాల తదితర ఏర్పాట్లను నగర పాలక సంస్థ నిర్వహించాలని కోరారు. అనంతరం గోడపత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే వారికి సేవలు అందించేందుకు భక్తులతో రంగనాథ సేవ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఆలయ సహాయక కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి జరిగే సేవలను, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

నెల క్రితం పెళ్లి.. అంతలోనే విషాదం!

- చెముడుగుంట వద్ద బైక్‌ను ఢీకొన్న ఆటో
- నవదంపతులపైకి దూసుకెళ్లిన బస్సు
- అక్కడికక్కడే ఇద్దరూ మృత్యువాత
- గుండెలవిసేలా విలపించిన కుటుంబసభ్యులు

సరిగ్గా నెల రోజుల క్రితం వారిద్దరికీ వివాహమైంది. ఎంతో అన్యోన్యంగా ఉంటున్న ఆ నవదంపతులను చూసి కన్నవారు మురిసిపోయారు. నిండు నూరేళ్లు కలిసి జీవించాలనుకున్న ఆ యువజంటను చూసి మృత్యువుకు కన్నుకుట్టినట్టుంది. పరీక్ష రాసేందుకు బయలుదేరిన దంపతులను ఆటో రూపంలో వచ్చి కబళించేసింది. వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై ఓ ఆటో బైక్‌ను ఢీకొనడంతో రోడ్డుపై పడ్డ దంపతులపైకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. దీంతో శరీర భాగాలు ఛిద్రమై దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సరిగ్గా నెల రోజుల క్రితం వివాహం చేసుకున్న పిల్లలు రోడ్డుపై విగతజీవులాగా పడి ఉండటాన్ని చూసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపించారు.



ప్రశాంత్,పుష్పల పెళ్లినాటి ఫొటో (ఫైల్)

వెంకటాచలం, మార్చి 7 : నెల్లూరులోని రామ కోటయ్య నగర్ ప్రాంతానికి చెందిన మన్నెం బాబు కుమార్తె పుష్ప (25) రావూస్ కళాశాలలో ఎంబీఏ చదువుతోంది. గత నెల 8వ తేదీన నవాబుపేట సమీపంలోని కామాటి దళితవాడకు చెందిన ప్రశాంత్ (28)తో ఆమెకు వివాహమైంది. చెన్నైలో ఉద్యోగం చేస్తున్న ప్రశాంత్ వివాహం తర్వాత ఇంటి వద్దనే ఉంటు న్నాడు. కాగా, వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద కృష్ణచైతన్య పీజీ కళాశాలలో గురువారం మధ్యాహ్నం ఎంబీఏ పరీక్షను పుష్ప రాయాల్సి ఉంది. దీంతో ప్రశాంత్ తన భార్యను బైక్‌పై ఎక్కించుకుని పరీక్ష కేంద్రానికి బయలుదేరాడు. చెముడుగుంట సమీపానికి వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో దంపతులిద్దరూ జాతీయ రహదారిపై పడిపోయారు. అదే సమయంలో వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు దంపతులపైకి దూసుకెళ్లింది. దీంతో ప్రశాంత్, పుష్పలిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో హాల్ టికెట్‌తోపాటు పుస్తకాలు పడిపోవడం, ఇద్దరిపై బస్సు దూసుకెళ్లడంతో శరీర అవయవాలు ఛిద్రం కావడంతో ఆ ప్రాంతమంతా హృదయ విదారకంగా మారింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. వివాహం జరిగి నెల రోజులు కాక ముందే విగతజీవులుగా మారారంటూ కన్నీరుమున్నీరయ్యారు. కాగా, ఈ ఘటనతో హైవేపై ట్రాఫిక్ కొంతసేపు స్తంభించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవనిలో సగం.. ఆకాశంలో సగం.. అన్నింటా సగం అయిన మహిళలు తమ హక్కులను కాపాడుకునేందుకు 'పోరాడితే పోయేది లేదు బానిస సంకెళ్లు తప్ప' అనే పిలుపు మహిళల్లో చైతన్య స్ఫూర్తిని రగిలించింది. పురుషాధిక్యత నుంచి స్త్రీలకు స్వేచ్ఛ, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి చట్టాలు తీసుకొచ్చినా ఇంకా పోరాటాలు చేయక తప్పడం లేదు. ఈనాటికీ ఎన్ని చట్టాలు వచ్చినా ఆడపడచులపై అఘాయిత్యాలకు అడ్డుకట్ట పడటం లేదు. అయితే సామాజిక మాధ్యమాలు ఊపందుకున్న నేపథ్యంలో వీటితో కొంత వరకు విజయాలు సాధిస్తూ తమ ప్రతిభను చాటు కునేందుకు నారీ మణులు చేస్తున్న కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు ఎదుర్కొం టున్న పరిస్థితుల నుంచి పోరాట స్ఫూర్తితో పుట్టిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

ప్రణాళిక, పట్టుదల అవసరం



మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీలేదు. మహిళలు వంటింటికే పరిమితం కావాలన్న భావజాలం కూడా చాలావరకు తగ్గిపోయి పురుషులు కూడా మహిళలను ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడు కావాల్సిందల్లా మహిళలకు సరైన ప్రణాళిక, అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదల మాత్రమే. మహిళలు తలుచుకుంటే ఏ రంగంలోనైనా మేటిగా రాణించ గలరని ఎందరో మహిళలు నిరూపించి మనందరిలో స్ఫూర్తిని నింపారు. కందుకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గా స్వతంత్ర నిర్ణయాలతో పరిపాలన చేసి చూపించిన నేను ఆ తర్వాత పట్టుదలతో ఏపీపీ ఎస్సీ పరీక్షలకు సిద్ధమై నేడు ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహిస్తున్నా. అయితే మహిళలు ఆత్మన్యూనతను విడనాడటంతోపాటు తాను అధికురాలిని అన్నభావన కూడా రానీయ కుండా కర్తవ్య నిర్వహణలో ఓ కుమార్తె గా, భార్యగా, తల్లిగా, కోడలిగా బాధ్యతగా వ్యవహరిస్తే జీవితంలో అన్నివిధాలుగా విజేతలుగా నిలుస్తారు.

- ఎం. శివకుమారి, ఎక్సైజ్ సీఐ, కందుకూరు



కందుకూరు : ఏరియా ఆసుపత్రిలో కేక్ కట్‌చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది



మహిళలు.. మహారాణులు

- అన్నింటిలో సమానం.. దేన్నైనా సాధిస్తాం!
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నెల్లూరు (విద్య), మార్చి 7 : తమ బాధలు, సమస్యలను చర్చించుకోవడానికి, నలుగురితో పంచుకోవడానికి ఒక రోజు ఉండాలని నిర్ణయించారు మహిళలు. ఆ రోజును మహిళా దినోత్సవంగా ప్రకటించారు. తొలిసారి అమెరికాలోని చికాగోలో మహిళా దినోత్సవానికి 1908లోనే బీజాలు పడ్డాయి. వారి డిమాండ్లతో అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909, మార్చి 8న జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది. అయితే, ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని కోపెన్‌హెగన్ నగరంలో 1910లో జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్ సదస్సుల్లో ఆమోదించారు. అలా మహిళలకు ఓటుహక్కు, సమానహక్కు సాధించడానికి ఇలాంటి సమావేశాలు నాందిపలికాయి. 1975లో ఐక్యరాజ్య సమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిన నాటి నుంచి అన్ని దేశాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు

ఇంటర్నెట్ వినియోగం

ప్రపంచమే కుగ్రామంగా మారుతున్న తరుణంలో తరుణీమణి అంతర్జాల సేవల్లో ముందుకెళుతోంది. అందు బాటులో ఉన్న సాంకేతికతను అన్ని రకాలుగా ఉపయోగించుకునేందుకు మహిళలు ఆరాటపడుతున్నారు. ఇంటర్నెట్ గొడుకు కింద సంఘటిత శక్తిగా ఎదుగుతున్నారు. సమస్యలకు పరిష్కారాలు అన్వేషించడంతో పాటు గంటల వ్యవధిలో కీలక సమాచారాన్ని సేకరిస్తున్నారు. విద్య, విధినిర్వహణలో ఎందరో కంప్యూటర్ కీబోర్డుపై తమ జోరును చూపిస్తున్నారు. జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ ఇతర ఉన్నత విద్యార్హతలున్న యువతుల ఉపాధి అవకాశాల కోసం తరచూ వెబ్‌సైట్‌లో పరిశీలిస్తూ ఉద్యోగాలను ఎంపిక చేసుకుంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వశాఖల పరిధిలో కీలక సమాచా రాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడం, మెయిల్స్ పంపించడం, వెబ్‌సైట్‌లో శాఖాపరంగా ప్రగతిని పొందుపరచడం వంటి పనులు చేస్తున్న వారిలో మహిళలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. అలాగే పలు బ్యాంకుల్లో సైతం కీలకమైన సమాచార ప్రతినిధులుగా మహిళా ఉద్యోగులే పని చేస్తున్నారు. ఉపాధిహామీ పనుల వివరాలు, నీటిపారుదల శాఖ, ఇంజనీరింగ్, రవాణా, విద్యాశాఖ విభా గాల్లో మహిళా ఉద్యోగులు ఆన్‌లైన్‌నే సమాచార వారధికి సాధనంగా మార్చుకుంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, ఇతరత్రా సంస్థలు, పరిశ్ర మల్లోనూ మహిళా ఉద్యోగులే కార్యాలయ కార్యకలాపాలను, రోజువారీ ప్రగతిని పొందుపరుస్తున్నారు.

సాధికారత ప్రశ్నార్థకమే..

ఎన్ని పోరాటాలు, త్యాగాలు చేసినా, టెక్నాలజీ ఎంత పెరిగినా ఇంకా మహిళా సాధికారత ప్రశ్నార్థకంగానే ఉండడం దురదృష్టకరం. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత శిఖరాల్లో నిలిచిన మహిళలకు ఇంకా లింగ వివక్ష, హింస, దురాగతాలు తప్పడం లేదు. మహిళా దినోత్సవం జరుపుకోవడం ప్రారంభమై వంద ఏళ్లు దాటినా ఇంకా మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులు కూడా దక్కకపోవడం విచారకరమనే చెప్పాలి.

కుటుంబ ప్రోత్సాహం అవసరం



మహిళలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి, భార్యను, తల్లిని సంతోషంగా ఉంచటం నేటి కాలంలో పురుషుల బాధ్యత అన్న విషయం మరిచిపోకూడదు. కోవిడ్ తర్వాత స్ట్రోక్, డిప్రెషన్ వంటి కేసులు చూస్తున్నాను. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటే మహిళలు ఏ రంగాల్లో అయినా రాణిస్తారు. కుటుంబం కోసం మహిళలు కొవ్వొత్తులా వెలిగిపోతుంటారు. మహిళలు వైద్య రంగంలో ఎన్నో విజయాలు సాధిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి.

- డాక్టర్ లావణ్య, న్యూరాలజిస్ట్, జీజీహెచ్, నెల్లూరు

అన్ని రంగాలలో రాణించాలి



ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాలలో రాణిస్తున్నారు. మహిళలకు సేవా దృక్పథం ఎక్కువ. అందుకే తన ఇంటిని చక్కదిద్దుకుంటూ తను ఏ వృత్తిలో అయితే ఉందో అ వృత్తిలో కూడా తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటోంది. మహిళలకు చట్టపరంగా కూడా పూర్తి రక్షణ కలిగిస్తూ ప్రభుత్వాలు శాసనాలు చేస్తున్నాయి. అందువల్లే నేటి సమాజంలో మహిళ తిరుగులేని శక్తిగా తలెత్తుకుని ఎదుగుతూ ఉంది. అ దిశగా మహిళలు ముందుకు సాగాలి.

- రేవూరు శశికళ, సీనియర్ న్యాయవాది, నెల్లూరు

అబల కాకూడదు!



కుటుంబాన్ని తన భుజస్కంధాలపై నిత్యం మోసే మహిళలు నేడు సమాజంలో ఎదుగుతున్నారు. అటువంటి మహిళలను ప్రోత్సహించి మరింత ముందుకు తీసుకెళ్తే ప్రపంచస్థాయిలో విజయాలు అందుకునే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరి విజయం వెనక ఓ మహిళ ఖచ్చితంగా ఉంటుందని చరిత్ర చెబుతోంది. అటువంటి మహిళ అబల కాకూడదు. ప్రపంచస్థాయిలో కీర్తి ప్రతిష్ఠల్ని నిలపగలిగే సత్తా, అన్నిరంగాల్లో రాణించే బలం మహిళకు ఉంది. మహిళకు నేటికీ అపశ్రుతులు ఎదురవుతూనే ఉన్నాయి. వాటిని ఎదుర్కొని సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సొంతం చేసుకున్న నాడే సంపూర్ణ మహిళగా సమాన హక్కులను సాధించినట్టు.

- బి.ప్రసన్న లక్ష్మి, సబ్ రిజిస్ట్రారు, అల్లూరు



ర్యాలీలో పాల్గొన్న సర్పంచులు

జగన్‌ను ఓడిస్తేనే గ్రామీణాభివృద్ధి

- పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

నెల్లూరు, (జడ్పీ): రాష్ట్రంలో నిర్వీర్యమైన స్థానిక సంస్థలను కాపాడుకోవాలన్నా, గ్రామీణాభివృద్ధి జరగాలన్న సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఓడించాలని పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సీఎం జగన్ దొంగలించి గ్రామాలాభివృద్ధికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. మహాత్మా గాంధీ కన్న కలలు సాకారం కావాలంటే వచ్చే ఎన్నిక ల్లో వైసీపీని చిత్తుగా ఓడించి జగన్‌ను తరిమి కొట్టాలని పిలుపుని చ్చారు కార్యక్ర మంలో ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మునిరెడ్డి సుబ్బరామయ్య, నాయకులు ధనుంజయ యాదవ్ నాగేంద్రరెడ్డి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ ఉంటేనే రైట్!

నెల్లూరు నగరం.. ఈ పేరు వినగానే టక్కున గుర్తుకు వచ్చేది ట్రాఫిక్ ఇబ్బందులు. విచ్చలవిడిగా రాకపోకలు.. అడ్డదిడ్డమైన పార్కింగ్‌లతో వాహనదారులతోపాటు నగర వాసులూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు నగర పాలక సంస్థ త్వరలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. ఇందుకోసం రూ.1.4 కోట్లు ఖర్చు చేస్తున్న అధికారులు తొలి విడతగా నగరంలోని 7 ప్రాంతాల్లో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది.

- నెల్లూరు నగరంలో సిగ్నల్ వ్యవస్థ
- తొలివిడతగా 7 ప్రాంతాల్లో ఏర్పాటు
- రూ. 1.4 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి
- హైదరాబాదుకు చెందిన కంపెనీకి బాధ్యతలు
- నగర వాసులకు తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

నెల్లూరు (సిటీ), మార్చి 7 : 149.02 చ.కి.మీ మేర విస్తరించిన నెల్లూరు నగరంలో సుమారు 8 లక్షల మంది జనాబా ఉంది. వీరిలో నిత్యం 30 శాతం మంది రోడ్లపై ప్రయాణిస్తుంటారు. దీంతో నగర రహదారులన్నీ రద్దీతో నిండిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బందికరంగా మారింది. గడిచిన కొన్నేళ్లుగా ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు తీసుకున్న, తీసుకుంటున్న చర్యలు శూన్యం. కార్పొరేషన్‌కు కమిషనర్‌గా వికాస్‌మర్మత్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు మార్పులు తీసుకుని వస్తున్నారు. ఈ నేపథ్యంలో సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. తొలిగా కేవీఆర్ జంక్షన్, హరనాథపురం కూడలి, కనకమహల్ సెంటర్, వీఆర్సీ కూడలి, మద్రాస్ బస్టాండ్ సెంటరు, జిల్లా పోలీసు ఆఫీస్ జంక్షన్, రామలింగాపురం కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. మిగిలిన ప్రాంతాలలో రెండోదఫా సిగ్నల్స్ అందుబాటులోకి తీసుకురానున్నారు.



రూ.1.40 కోట్ల ఖర్చుతో..

నెల్లూరులో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు కార్పొరేషన్ రూ.1.40 కోట్లు కేటాయించింది. ఒక్కోచోట రూ.20 లక్షలతో సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసిన అధికారులు హైదరాబాద్‌కు చెందిన ఎస్‌పీటీ నెట్‌వర్క్ టెక్నాలజీ సంస్థకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ నెలాఖరులోపు ప్రక్రియ పూర్తవుతుందని కార్పొరేషన్‌లోని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే నెల్లూరులో ట్రాఫిక్ కష్టాల నుంచి కొంతమేర గట్టెక్కినట్టే.

ఆంబోతులా మాట్లాడుతున్న అనిల్

- వేమిరెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదు..
- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి ఆగ్రహం


మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (వైద్యం), మార్చి 7 : నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ అచ్చొచ్చిన ఆంబోతులా మాట్లాడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మండిపడ్డారు. గురువారం నగరంలోని 45వ డివిజన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని విమర్శించేస్థాయి అనిల్‌కు లేదన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన వేమిరెడ్డిని వైసీపీ ఇబ్బందులకు గురి చేసిందని, దాన్ని తట్టుకోలేక ఆయన టీడీపీలో చేరారన్నారు. 2009, 2014, 2019 అసెంబ్లీ ఎన్నికలలో వేమిరెడ్డిని అడుక్కుని డబ్బులు తీసుకున్న విషయం మరచి పోయావా అంటూ అనిల్‌ను ప్రశ్నించారు. డబ్బు తీసుకోలేదని ప్రమాణం చేసే దమ్ముందా!? అంటూ సవాల్ విసిరారు. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సేవాకార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేసే వేమిరెడ్డిపై అనిల్ అవాకులు చవాకులు పేలిస్తే తరిమి తరిమి కొడతామని హెచ్చరించారు. పెన్నా ఇసుకను అమ్ముకున్న చరిత్ర అనిల్‌దని, రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి రూ.600 కోట్లు సంపాదించారని ఆరోపించారు. అభివృద్ధి చేయకుండా ఓట్లు అడిగితే నెల్లూరు సిటీ ప్రజలు తంతారని భయపడిన అనిల్ నరసరావుపేటకు పారిపోయారంటూ ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు సుజనకుమార్, ఆకుల హనుమంత రావు, జన్నీ, చిరంజీవి, శివ, నాగరాజు, ప్రసాద్‌నాయుడు, కార్తీక్, అనిల్, విజయ్, వాసు, డివిడ్, మనోజ్ పాల్గొన్నారు.

వీపీఆర్‌ను విమర్శించే అర్హత అనిల్‌కు లేదు !

- టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న కోటంరెడ్డి

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని విమర్శించే అర్హత ఎమ్మెల్యే అనిల్ కుమార్‌కు లేదని టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2008లో కార్పొరేటర్‌గా పోటీ చేసినప్పుడే వీపీఆర్ దగ్గర అనీల్ చందా తీసుకున్నారని ఆరోపిం చారు. మంత్రి పదవిపోయాక బీద అరుపులు అరిచినప్పుడూ అనీల్‌కు వేమిరెడ్డి ఆర్థిక సాయం చేశారన్నారు. వేమిరెడ్డి వద్ద డబ్బులు తెచ్చుకోలేదని అనీల్ చెప్పగలరా అంటూ నిలదీశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డికి కూడా వీపీఆర్ సాయం చేశారని, ఆ విషయం విజయసాయిరెడ్డికి కూడా తెలుసునని చెప్పారు. అభిప్రాయ బేధాలు ఉన్నప్పుడు పార్టీలు మారడం సహజమని, పార్టీ మారిన వారంతా ద్రోహులైతే ఆ వరుసలో ముందుగా జగన్మోహన్‌రెడ్డి, అనీల్‌కుమార్ ఉంటారని అన్నారు. హిందు, ముస్లిం, క్రిస్టియన్ల మనోభావా లను దెబ్బతీస్తూ మాట్లాడిన అనీల్‌కుమార్ వెంటనే వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నెల్లూరు సిటీలో నారాయణ దెబ్బకు ప్యాంటు తడుపుకొని పారి పోయిన అనిల్‌కు నరసరావుపేటలో భారీ ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్ పాల్గొన్నారు.

పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్న అనిల్

- టీడీపీ నేత కేతంరెడ్డి ఆగ్రహం


మాట్లాడుతున్న కేతంరెడ్డి వినోద్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం) : నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని టీడీపీ నేత కేతం రెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై అనిల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సి బిలిటీ కింద పలువురు వ్యాపార, పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమలు ఉండే చోట నిధులు వెచ్చిస్తారనీ, అయితే, తెలు గురాష్ట్రాల్లో అసలు వ్యాపారాలేలేని వీపీఆర్ 2015 నుంచి విద్య, వైద్యం, అమృతధార పేరుతో వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేస్తు న్నారని చెప్పారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి సొంత కంపెనీలు ఉన్నా ఎక్కడైనా ఒక్క రూపాయి పెట్టారా అంటూ ప్రశ్నించారు.

కావలి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

- రూ. 7.50లక్షల నగదు, బంగారు నగల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు, నగలతోపాటు నిందితుడితో జీఆర్పీ ఎస్ఐ అరుణకుమారి

కావలి రూరల్, మార్చి7: పట్ట ణంలోని రైల్వేస్టేషన్‌లో గురు వారం నిర్వహించిన తనిఖీల్లో నగదుతో పాటు ఎలాంటి పత్రాలు లేని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ అరుణ కుమారి తెలిపారు. ఆమె కథనం మేరకు, రానున్న ఎన్నికల దృష్ట్యా ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు స్టేషన్‌లోని 2వ నంబరు ప్లాట్ ఫారంపై ప్రయాణికుల లగేజీలు తనిఖీలు చేశామన్నారు. ఈ తనిఖీల్లో పట్టణానికి చెందిన పొన్నూరు కృష్ణ బ్యాగులో రూ.7,50,000 నగదుతోపాటు సుమారు రూ.5 లక్షల విలువైన 88.910 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, నగదు, నగలు విజయవాడలోని ఇన్‌కంట్యాక్స్ డిపార్టుమెంట్‌కు పంపినట్లు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది ఎం. వెంకటేశ్వరరావు, వీ మనోహర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నట్లు ఆమె వివరించారు.

ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు

- 80 కిలోల సీజ్, రూ. 40 వేల జరిమానా


నగరంలోని ఓ దుకాణంలో ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో

నెల్లూరు(సిటీ),మార్చి 7: నిబంధనలను అతిక్రమించి 130 మైక్రాన్ల కన్నా తక్కువ పరిమాణం కలిగిన ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణాలపై కార్పొరేషన్ ఆరోగ్య విభాగం అధికారులు గురువారం ఆకస్మిక దాడులు చేశారు. నెల్లూరు నగరంలోని చిన్నబజార్, శిఖరం వారివీధి, ట్రంకురోడ్డు, స్టోన్‌హౌస్‌పేట తదితర ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో నిబంధనలు పాటించని దుకాణాల పై రూ. 40 వేలు వరకు జరిమా నాలు విధించామని, వారి వద్ద నుంచి 80 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎంహెచ్‌వో వెంకట రమణయ్య తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	70
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	240
లేయర్	120

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6228
వెండి కిలో ధర	రూ. 74,700
వెండి ఒక గ్రాము	రూ. 76.70

బీఎస్‌ఎఫ్ సిబ్బంది రాక

నెల్లూరు(క్రైం) మార్చి 7: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బీఎస్‌ఎఫ్(బార్డర్ సెక్యూ రిటీ ఫోర్స్) సిబ్బంది గురువారం జిల్లాకు చేరుకున్నారు. నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాలకు 120 మంది రాగా, కావలి నియోజకవర్గానికి 66 మంది వచ్చారు. నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల సిబ్బందికి వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ కళాశాల, కావలి నియోజకవర్గ బీఎస్‌ఎఫ్ సిబ్బందికి మద్దూరు పాడులోని కళాశాలలో వసతి కల్పించారు. ఈనెల 10న మరో ప్లటూన్ సిబ్బంది రానున్నారు. వారిని ఆత్మకూరు నియోజకవర్గానికి కేటాయించనున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో బానిసలుగా బీసీలు

- చంద్రబాబు బీసీ డిక్లరేషన్‌పై తట్టుకోలేకున్నారు !
- ఒక్క బీసీ భవనమైనా నిర్మించారా !?
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

నెల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో బీసీలు బానిసలుగా, బాధితులుగా మారి పోయారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవి చంద్ర అన్నారు. గురువారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి ఆదరణ, సంక్షేమం, అభివృద్ధి అందక బీసీలు చితికి పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు బీసీ డిక్లరేషన్ పట్ల బీసీల్లో హర్షం వ్యక్తమవుతుంటే వైసీపీ తట్టుకోలేకపోతోందని విమర్శించారు. ఐదేళ్లలో బీసీ భవన్లు కూడా నిర్మించలేని మంత్రులు, నేడు నోటికొచ్చినట్లు మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖలో అమర్నాథ్, నెల్లూరులో అనిల్, గుంటూరులో రజనీ, అనంతపురంలో ఉషశ్రీ, శంకరనారాయణ, గోదావరి జిల్లాల్లో సుభాష్‌చంద్రబోస్, వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, కృష్ణా జిల్లాలో జోగి రమేష్, శ్రీకాకుళంలో ధర్మాన, విజయనగరంలో బొత్స వంటి మంత్రులు ఆయా జిల్లాల్లో ఎందుకు బీసీ భవన్ నిర్మించలేకపోయారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో 34 శాతం ఉన్న రిజర్వేషన్లను వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి కుదించడం మూలంగా 16,860 పదవులను బీసీలు కోల్పోయారని చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 13 జడ్పీటీసీ స్థానాలకు బీసీలకు దక్కగా రిజర్వేషన్లను కుదించిన కారణంగా కేవలం ఆరు మందికి మాత్రమే అవకాశం దక్కిందని చెప్పారు. మిగిలిన ఏడు స్థానాలు బీసీలకు దూరం కావడానికి కారణం ఎవరని బీద ప్రశ్నించారు. ఆదరణతో సహా టీడీపీ తీసుకొచ్చిన 30 సంక్షేమ పథకాలను రద్దు చేసి బీసీలకు తీరని అన్యాయం చేశారని ఆయన ప్రభుత్వంపై మండిపడ్డారు. బీసీల హక్కులను కాలరాసిన వైసీపీ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకొని తమకు మద్దతు ఇవ్వాలంటూ బీసీలను కోరుతోందని నిలదీశారు.

మహిళలకు ఆర్థిక అండగా చేయూత

నెల్లూరు (హర నాథపురం), మార్చి 7: వైఎస్ఆర్ చేయూత పథకం మహిళలకు ఆర్థిక అండగా నిలిచిందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొ న్నారు. 4వ విడత చేయూత నిధులను గురువారం అనకాపల్లి నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేయగా, నెల్లూరు కలెక్టరేట్ తిక్కనభవన్ లో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి, కలెక్టర్ హరినారాయణన్‌లు కలిసి మెగా చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్మో హన్ చెప్పిన మాట ప్రకారం చేయూత ద్వారా నాలుగు విడతల్లో ఒక్కొక్క మహిళకు రూ. 75వేల వంతున విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా నాలుగో విడతలో 1,26,710 మంది లబ్ధిదారులకు రూ.237.58 కోట్లను విడుదల చేశారు.

మసీదుల వద్ద ముందస్తు ఏర్పాట్లు చేయండి

నెల్లూరు (హర నాథపురం), మార్చి 7 : ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్న రంజాన్ మాసాన్ని పురస్క రించుకొని మసీదుల వద్ద ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో లవన్న అధికారులను ఆదేశించారు. గురువారం మైనార్టీ సంక్షేమశాఖ అధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో రంజాన్ మాసం ఏర్పాట్లపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల వద్ద ప్రార్థన సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. మసీదుల వద్ద అపరి శుభ్రంగా లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి, డీపీవో సుస్మిత, డీఎంహెచ్‌వో పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

నెల్లూరు (విద్య) : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సంస్కృతం మూల్యాంకనాన్ని శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఏ శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు వారి కళాశాలల్లో పనిచేస్తున్న సంస్కృతం అధ్యాపకులను శుక్రవారం రిలీవ్ చేయాలన్నారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్పాట్ వాల్యూయేషన్ క్యాంప్ వద్ద రిపోర్టు చేయాలని తెలిపారు. కాగా, గురువారం జరిగిన ద్వితీయ సంవత్సరం జనరల్ మ్యాథ్స్-2ఏ, బోట నీ-2, సివిక్స్-2తో పాటు ఒకేషనల్ పరీక్షలకు 597 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వ హణ తీరును పరిశీలించేందుకు ఆర్ఐవో డాక్టర్ శ్రీని వాసులు, డీవీఈవో మధుబాబు డీఈసీ సభ్యులు, స్క్వాడ్ లు పలు కేంద్రాలను తనిఖీ చేశారు.

మరుపూరులోనూ కాకాణి అక్రమ మైనింగ్

పొదలకూరు, మార్చి 7: వరదాపురం, రుస్తుం భారత్‌మైన్‌లో రూ.కోట్లలో దోచుకున్న మంత్రి కాకాణి మళ్లీ మరుపూరులో అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ప్రభగిరిపట్నం పంచాయతీలోని ఉలవరపల్లిలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాకు పెంచలయ్య, గోగుల దయాకర్, కాకు చక్రపాణి, కండే రవి, గడుపూడి వంశీ, పి.మధు, మండల నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఈసీ డ్వామాకి సరెండర్

విడవలూరు: ఉపాధి హామీ పథకం ఈసీ సోఫియాని డ్వామాకి సరెండర్ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగినందున గతనెల 28న జలదంకి మండలానికి ఆమెని బదిలీచేశారు. అయితే మండలంలో ఉపాధిపనులపై సోషల్ ఆడిట్ జరుగుతున్నందున ఆమెను బదిలీ చేయకుండా తాత్కాలికంగా వాయిదా వేసినట్లు, సోషల్ ఆడిట్ ముగిసినందున ఆమెను డ్వామాకి సరెండర్ చేశామని ఆయన తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైం) మార్చి 7: వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటనపై గురువారం వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన రవికుమార్(55)- కుమారి దంపతులు. వారికి సంతానం లేకపోవడంతో రవికుమార్ తన మరదలు శాంతికుమారిని మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. రవికుమార్ 25 ఏళ్ల కిందట నెల్లూరుకు వచ్చి ఇక్కడే ఉంటూ ఓ అడ్వకేట్ వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ మహిళతో సహజీవనం చేస్తూ వైఎస్ఆర్‌నగర్‌లో ఉంటున్నారు. రవికుమార్ రెండు నెలలకోసారి విజయవాడలోని కుటుంబసభ్యుల వద్దకు వెళ్లి వచ్చేవాడు. రెండు నెలలుగా తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. సహజీవనం చేస్తున్న మహిళ ఇతరులతో సన్నిహితంగా ఉండటంతో ఇటీవల రవికుమార్ ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో గురువారం దీంతో ఆ మహిళ అతను ఇంట్లో ఉండగా బయటకు వచ్చి తలుపునకు గడియ పెట్టి స్థానికంగా ఉన్న వెంకటేశ్వర్లుకు విషయం తెలిపింది. వారిద్దరూ ఇంట్లోకి వెళ్లి చూడగా రవికుమార్ మంచంపై కదలకుండా పడిఉన్నాడు. దీంతో వారు 108కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని రవికుమార్‌ను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో వెంకటేశ్వర్లు జరిగిన విషయాన్ని రవికుమార్ మొదటి భార్యకు తెలియజేశారు. మొదటి భార్య, మృతుడి సోదరుడు రమేష్‌బాబులు నెల్లూరుకు చేరుకుని వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైం) మార్చి 7: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు గురువారం మృతిచెం దింది. పోలీసుల కథనం మేరకు నెల్లూరు రామకోటయ్యనగర్ సమీపంలోని వసుధా నగర్‌కు చెందిన పరంధామయ్య-ఉమాపద్మావతి దంపతులు. పరంధామయ్య తల్లి భాగ్య లక్ష్మి కుమారుడు వద్దే ఉం టోంది. భాగ్యలక్ష్మికి అధిక రక్తపోటుతో బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఏడాదిగా ఆమె మందులు వాడుతున్నారు. కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడు తూ, ఈ బాధ భరించలేను.. చనిపోతా నని కొడుకు, కోడలకు ఆమె చెబుతూ ఉండేది. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నా నికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాల్లో చేర్పించారు. అక్కడ నుంచి ఈ నెల 6వ తేదీ జీజీహెచ్‌కు మార్చారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.ఈ మేరకు మృతురాలి కుమారుడు పరంధామయ్య వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలసదన్‌లో నియామకాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (వైద్యం)మార్చి 7 : జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలసదన్‌లలో ఉద్యోగ నియామకాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమశా అధికారి హేనాసుజన్ ఒక ప్రటనలో తెలిపారు. నెల్లూరు నగరంతో పాటు తిరుపతి జిల్లాలోని గూడూరు, కోట, వెంకటగిరిలలో ఉన్న బాలసదన్ లలో నలు గురు వంటవారు, ఓ హెల్పర్, నలుగురు వాచ్‌మెన్‌లు, ఇద్దరు యోగా టీచర్‌లు, ము గ్గురు ఎడ్యుకేటర్‌లు, ఒక ఆర్ట్, క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకో వాలన్నారు. తాత్కాలిక పద్ధతిలో జరిగే ఈ నియామకాలకు ఈనెల 16వ తేదీ లోపు దరఖాస్తులను జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో అందచేయాలన్నారు.

'సఖీ'లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వైద్యం)మార్చి 7 : జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడు స్తున్న సఖీ వన్‌స్టాప్ సెంటర్‌లో పారాలీగల్ పర్సనల్ అడ్వకేట్, కేస్ వర్కర్, సెక్యూరిటీ గార్డుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని శిశు సంక్షేమశాఖ జిల్లాఅధికారి హేనాసుజన్ తెలిపారు. ఆయా విభాగాలలో ఒక్కో పోస్టుకు ఈనెల 16వ తేదీలోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయానికి పూర్తి చేసిన దరఖాస్తులను పంపాలన్నారు.

ఎస్ఏ పదోన్నతులకు ఆహ్వానం

నెల్లూరు (విద్య) : జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ మేనేజ్‌మెంట్లలో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పదోన్నతులకు అర్హత కలిగిన ఎస్‌జీటీలను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్‌లు, జెరాక్స్ కాపీలు, సర్వీస్ రిజిస్టర్లతో ఎంఈవోల అనుమతి తీసుకుని, శనివారం ఉదయం 10 గంటలకు డీఈవో కార్యాలయంలో హాజరు కావాలని ఆయన తెలిపారు.

పాశ్చాత్య ఆహారం వద్దు

సంప్రదాయమే ముద్దు!

- ఉరుకులు, పరుగుల జీవన విధానంతోనే బీపీ, షుగర్
- పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు


మహిళా ప్రముఖులతో వెంకయ్య, దీపావెంకట్

వెంకటాచలం, మార్చి 7: సంప్రదాయ ఆహారం వదిలి పాశ్చాత్య ఆహారపు అలవాట్లతోనే అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గురువారం మధ్యాహ్నం స్వర్ణభారత్ ట్రస్ట్, నారాయణ మెడికల్ కళాశాల, బసవతారకం కాన్సర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉరుకులు పరుగులతో కూడిన జీవన విధానం వల్ల కూడా బీపీ, షుగర్, గుండెపోటు వస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే సంప్రదాయ ఆహారపు అలవాట్ల దిశగా ప్రతి ఒక్కరూ దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రకృతితో కలిసి జీవించడం వల్ల అనేక సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను వీడి కుటుంబంలో సానుకూల వాతావరణంలో వాటి వినియోగాన్ని తగ్గించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. కరోనా అనంతరం సిరిధాన్యాల పట్ల కొంత శ్రద్ధ పెరిగి రాగిజావ, జొన్నరొట్టెలు తీసుకుంటున్నారని చెప్పారు. ఆర్గానిక్ ఆహారం పట్ల కూడా అవగాహన పెరిగి, ఖరీదు ఎక్కువైనా వినియోగించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్, వైద్యులు తదితరులున్నారు.

- **ఆలోచన ధోరణిలో మార్పే మహిళా సాధికారత**

మహిళా సాధికారత రావాలంటే సమాజంలోని ప్రజల ఆలోచన ధోరణిలో మార్పు వస్తే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని వెంకయ్యనాయుడు అన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గురువారం సాయంత్రం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, ప్రజా జీవితాల్లో మహిళల చురుకైన పాత్ర ఎంతో అవసరమన్నారు. అనేక దేశాల్లో మహిళ సాధికారత విషయంలో గణనీయమైన పురోగతి ఉన్నా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మాత్రం ఇంకా సాధించాల్సిన సవాళ్లు చాలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో వారి పాత్ర అత్యంత కీలకమన్నారు. వివిధ రంగాల్లో వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు వంట గదికే పరిమితం కాకుండా తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ముందుకు దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. రాజకీయ రంగంలోనూ స్త్రీలకు ఎక్కువ అవకాశాలు కల్పించి అసెంబ్లీ, పార్లమెంట్‌లోకి వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించుకొని ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. విద్యతో మహిళల్లో చైతన్యం పెరుగుతుందన్నారు.

- **స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..**

స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అభినందన పురస్కారాలను ప్రముఖ మహిళలకు పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కలిసి స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ జ్ఞాపికలు అందజేసి పురస్కారాలతో సత్కరించారు. అంతకుముందు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయగీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రస్టీ హరికుమార్‌రెడ్డి, రత్నం విద్యా సంస్థల అధినేత డాక్టర్ కిషోర్ రత్నం తదితరులున్నారు.

కోదండరామిరెడ్డి జీవితం అందరికి ఆదర్శం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్య నాయుడు తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) మార్చి 7: 'వంగల్లు కోదండరామిరెడ్డి గురించి చదువుకునే రోజుల్లో వింటూ పెరిగాం. రాజకీయాలపై చర్చ సాగుతుంటే ఆయన ప్రస్తావన వచ్చేది. కోదండరామిరెడ్డి విలువలు, పట్టుదల, కృషిని నేటితరం రాజ కీయ నాయకులు అలవరుచుకోవాలి.. అందరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకో వాలి' అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. వరిష్ట రాజకీయ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు వంగల్లు కోదండరామిరెడ్డి జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని నగరంలోని డాక్టర్ రవీంద్రనాథ్‌ఠాగూర్ భవన్ లో గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం వెంకయ్య మాట్లా డుతూ కోదండరామిరెడ్డి హయాంలో విలువలతో కూడిన రాజకీయాలు ఉండే వని, ప్రస్తుతం రాజకీయాల్లో విలువలు కొరవడ్డాయన్నారు. మాజీ మంత్రి సోమి రెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో కోదండరామిరెడ్డి విగ్రహాన్ని నెలకొల్పేందుకు చర్యలు చేపడతామన్నారు. కనుపూరు కాలువకు ఆయన పేరు పెట్టేందుకు కృషి చేస్తామన్నారు. సీవీ శేషారెడ్డి మాట్లాడుతూ నాడు ప్రజల కోసం ఆస్తులు అమ్ముకొని సేవ చేసిన గొప్ప వ్యక్తి కోదండరామిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కోదండరామిరెడ్డి కుటుంబసభ్యులు, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

- **వెంకయ్యను కలిసిన కలెక్టర్**

నెల్లూరు(హరనాథపురం), : మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును కలెక్టర్ హరినారాయణన్‌ను ఆయన నివాసంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.

జిల్లాలో 19,20,682 మంది ఓటర్లు


రాజకీయపార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 7 : జిల్లాలో ఇప్పటి వరకు 19,20, 682 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. కలె క్టరేట్‌లోని చాంబర్‌లో గురువారం జరిగిన రాజకీయపార్టీ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 2,317 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను నియమించినట్లు చెప్పారు. ఫామ్ 6 కింద 211 దరఖాస్తులు, ఫామ్-7 కింద 596 దరఖా స్తులు, ఫామ్-8 కింద 172 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని త్వరితగతిన పరిష్కరిస్తున్నామని చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్ని బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. కందుకూరు నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు, కందుకూరులో ఒక లోకేషన్ మార్పునకు సంబంధించిన వివరాలను పార్టీల ప్రతినిధులు కలెక్టర్‌కు తెలి పారు. సమావేశంలో డీఆర్వో లవన్న, వైసీపీ నేత సీ నారాయణ, టీడీపీ నాయకులు రసూల్, బీజేపీ నేత శ్రీనివాస్, బీఎస్పీ నాయ కుడు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

- **నియమావళిని తప్పక పాటించాలి**

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఎన్నికల శిక్షణ ఇన్‌చార్జి టీ బాపిరెడ్డి అన్నారు. రాజకీయపార్టీల ప్రతినిధులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై గురువారం తిక్కన భవన్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ఖర్చులను రాజకీయపార్టీల ప్రతిని ధులు ఎన్నికల సంఘానికి తెలియ చేయాలన్నారు. ఎన్నికల్లో ప్రచారం చేసేటప్పుడు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతి తీసుకొని పార్టీ ఆఫీసులు పెట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఈ రాతిరి.. శివరాతిరి !

- మహాశివరాత్రికి సిద్ధమైన శైవక్షేత్రాలు
- నేటి నుంచి ఉత్సవాల ప్రారంభం
- భద్రతా చర్యల్లో పోలీసు యంత్రాంగం


ముస్తాబైన తిరునాళ్లతిప్ప దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం


అలంకరణలో శివుడు

ఆత్మకూరు, మార్చి 7: శివరాత్రి వేడుకలకు పట్టణంలోని శివాలయం, తిరునాళ్లతిప్పలో వెలసిన కాశీనాయన ఆశ్రమం, బైపాస్ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీనివాసేశ్వరస్వామి ఆల యాలు ముస్తాబయ్యాయి. ఆత్మకూరులోని శివాలయంలో శుక్రవారం ఉద యం 3గంటలకు స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, 7గం టలకు సామూహిక అభిషేకాలు, 11గంటలకు కల్యాణోత్సవం నిర్వహిం చనున్నట్లు ఆలయ పూజారి శివకుమార్‌శర్మ తెలిపారు. రాత్రి 8గంటలకు అష్టోత్త ర కలశాభిషేకం, 10 గంటలకు అన్నాభిషేకం, 11గంటల నుంచి లింగోద్భవ కాలంలో స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో చేస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఆత్మకూరులోని తిరునాళ్లతిప్పలో వెలసిన దుర్గా మల్లేశ్వరి ఆలయంలో ఉదయం 9గంటలకు ధ్వజా రోహణ, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవం, తెల్లవారుజామున 2గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారు. రాత్రికి కూచిపూడి నృత్య ప్రద ర్శన, పండిభజన తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. హనుమాన్‌జంక్షన్ వద్ద వెలసిన శ్రీనివాసేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసేశ్వరుడు, రాజరా జేశ్వరి, భువనేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వీరబ్రహ్మేం ద్రస్వామి దేవస్థానంలో ఉదయం 5 గంటల కు సుప్రభాతసేవ అనంతరం ప్రత్యేక పూజలు, ఉదయం 10 గంటలకు శ్రీగోవిందమాంబ సమేత వీరబ్ర హ్మేంద్రస్వాముల వారి కల్యాణం జరుప నున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పటిష్ఠ బందోబస్తు: జి.వేణు, సీఐ ఆత్మకూరు

పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న శైవక్షేత్రాల వద్ద ప్రత్యేక పర్య వేక్షణతో ఎప్పటికప్పుడు పోలీసు సిబ్బంది అప్రమత్తం చేస్తాం. ఆత్మకూరులోని శివాలయం, తిరునాళ్లతిప్ప దుర్గామల్లేశ్వర ఆలయాల వద్ద సీఐతో పాటు ఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లు, ఎన్‌సీసీ వాలంటీర్లను నియమించాం. అనంతసాగరం మండలం చిలకలమర్రి, కామిరెడ్డిపాడు, సోమశిల ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేశాం.

చేజర్ల: కోటిరామతీర్థంలోని కామాక్షి దేవ సమేత కోటేశ్వరస్వామి బహ్మో త్సవాలు బుధవారం అర్ధరాత్రి ధ్వజారోహణ కార్యక్రమంతో ఘనంగా ప్రా రంభమయ్యాయి. గురువారం తెల్లవారుజామున ఉత్సవమూర్తులకు గ్రా మోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

భీమేశ్వరుడికి వైభవంగా రావణసేవ



సంగం, మార్చి 7: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వంగల్లులో వెలసిన భీమేశ్వర స్వామి బుధవారం అర్ధరాత్రి రావణసేవపై భీమేశ్వరస్వామిని భక్తులు ఊరే గింపు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షిదేవి సమేత స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గజపూలమాలల తో అలంకరించి పూజలు చేశారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ఆత్మకూరు, మార్చి 7: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం శ్రీకృష్ణా సేవాసమితి సభ్యులు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు గుర్రం నాగేశ్వరరావు, కరారి సుధాకర్, చీర్ల మస్తానయ్య మాట్లాడారు. నియోజకవర్గంలో చదువుతున్న 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధిం చిన ముగ్గురు విద్యార్థులకు నగదు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యా యురాలు అనంతలక్ష్మి, పేరెంట్స్ కమిటీచైర్మన్ వంటేరు మల్లికార్జున పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం


ఎంపీడీవోను సన్మానిస్తున్న పొదుపు మహిళలు

ఉదయగిరి రూరల్: అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం వైఎస్‌ఆర్ క్రాంతి పథకం సభ్యులు మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏపీఎం ఖాజారంతుల్లా మాట్లాడారు. మహిళలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా సాధికారత సాధించేలా ముందడుగు వేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో ఈశ్వరమ్మ, అకౌంటెంట్ విజయమ్మ, సంఘమిత్ర కార్యదర్శి పద్మావతి, కోశాధికారి చంద్రకళను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీసీలు రత్నకుమారి, అనిల్, సురేష్, వీవోఏ పాల్గొన్నారు.

రేపు అమరావతిలో దివ్యాంగుల మహాగర్జన

ఉదయగిరి, మార్చి 7: అమరావతిలో శనివారం నిర్వహించే దివ్యాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలని వికలాంగుల సంఘం నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక స్టేట్‌పేట మదర్‌థెరిస్సా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మహాగర్జనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బకీరు జామవా, బెజవాడ బాలగురవయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉదయగిరి రూరల్, మార్చి 7: సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈవీఎంల పనితీరుపై స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం మండల అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు, స్వీప్ నోడల్, సహాయ నోడల్ అధికారులు బాలకేశవులు, ఖాజారంతుల్లాలు ఈవీఎంల ద్వారా ఏలా ఓటు వేయాలనే విషయాలను మహిళలకు అవగాహన కల్పించారు. సెక్టార్ అధికారి సురేష్ మహిళలతో ప్రత్యక్షంగా ఓటు వేయించారు. ఈ కార్యక్రమంలో సీసీలు, పొదుపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, మార్చి 7: వేసవిదృష్ట్యా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండలాధ్యక్షుడు కేతా వేణు గోపాల్‌రెడ్డి సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మండల సమామేశంలో మాట్లాడారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కలిసి పనిచేయాలన్నారు. వైద్య, ఆరోగ్య, వ్యవసాయ శాఖలపై, పంచాయతీరాజ్ పనులు, ఐసీడీఎస్, విద్యుత్, రహదారులు తదితర అంశాలపై చర్చించారు. ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, మండల ఉపాధ్యక్షుడు యు.పెంచలరావు, కె.ప్రమీల, ఆత్మకూరు సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో బాలాజీనాయక్, ఏవో శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ ఉషారాణి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడకు నీటిని తరలిస్తే ఉద్యమిస్తాం


కమిషనర్ షేక్ ఫజుల్లాలకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మార్చి 7: నారంపేటలోని పారిశ్రామికవాడకు పాతజంగాలపల్లి వద్ద నుంచి వాల్వ్ గేట్‌ను అమర్చి నీటి సరఫరా చేస్తే ఉద్యమిస్తామని సీపీఎం నాయకులు కె.డేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు కమిషనర్ షేక్‌ఫజుల్లాలకు వినతిపత్రం అంజేసి మాట్లాడారు. నీటిని మళ్లిస్తే భవిష్యత్‌లో ప్రజలకు నీటి ఇబ్బందులు వస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండురోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా అయ్యే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని పాల్గొన్నారు.

7యంఆర్‌పి1 సంతాపం తెలియజేస్తున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

ఫిజిక్స్ అధ్యాపకుడి మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మర్రిపాడు, మార్చి 7: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకులు కమల్ హసన్ మృతికి గురువారం సిబ్బంది, విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఇంటర్ పరీక్షల సందర్భంగా ఉదయగిరి లో డిపార్ట్‌మెంట్ అధికారిగా గుండెపోటుతో మృతి చెందడం విచారకరం అన్నారు. కొన్నేళ్లగా కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేసిన అతని కుటుంబాన్ని ఆదుకోవాలని తోటి అధ్యాపకులు కోరారు.

మొక్కుబడిగా అనంతసాగరం మండల సమావేశం

అనంతసాగరం, మార్చి 7: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సమావేశం మొక్కుబడిగా జరిగింది. కొన్నిశాఖల అధికారులు మాత్రం సమావేశానికి హాజరయ్యారు. గ్రామాల్లోని సమస్యలపై ఎలాంటి చర్చ జరుగలేదు. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో తాజ్ మస్రూర్, స్పోర్ట్స్ డైరెక్టర్ కాలువ నరసింహులు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన గురువారం జరిగిన మండల సమావేవం ప్రశాంతంగా ముగిసింది. సమావేశంలో తాగునీరు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ, పారిశుధ్యంపై వాడీవేడిగా చర్చ జరిగింది. మండలంలో తాగునీరు, పారిశుద్యం, డ్రైనేజీ, సిమెంట్ రోడ్లపై చర్చలు జరిపారు. వేసవికాలం నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలని, ఎక్కడ నీటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణరెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా శుద్ధిజల కేంద్రం


పాఠశాలలో మూలనపడ్డ సామగ్రి,మిషన్లు

ఉదయగిరి రూరల్: బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని శుద్ధిజల కేంద్రం యంత్రాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ సమస్యతో బిజ్జంపల్లితో పాటు కృష్ణారెడ్డిపల్లి, లింగం నేనిపల్లి గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. ప్రత్యామ్నాయంగా వీరు గ్రామాల నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. గతంలో వైఎస్‌ఆర్ సుజల స్రవంతి పథకం నుంచి శుద్ధిజలం సరఫరా చేసేవారని, ప్రస్తుతం అదీ కూడా మూతపడడంతో తాగునీటి తీవ్ర ఇబ్బందులు తప్పవంటున్నారు.

మల్లన్నకు మృగరాజ వాహన సేవ

కావలిటౌన్, మార్చి7: కావలి పట్టణ పాతూరులోని ప్రాచీన శివాలయం కుంభమాన తిరునాళ్ళ శ్రీ దుర్గా భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మల్లన్నకు మృగరాజ వాహన సేవలు చేశారు. రాత్రి మల్లన్న హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

మహిళలంతా ఉచిత న్యాయ సహాయానికి అర్హులే!

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమ



కందుకూరులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమాదేవి

కందుకూరు: మహిళలందరూ ఉచిత న్యాయసహాయానికి అర్హులేనని మహిళల రక్షణ కోసం ఎన్నో ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పూర్ణిమాదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల న్యాయసేవా ధికార సంఘం ఆధ్వర్యంలో ఉచిత న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ ప్రమీలారాణి, ఏజీపీ కే హరికోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది కె కోటయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యు ప్రభావతి, ఎల్ లక్ష్మీదేవమ్మ, వరల్డ్‌విజన్ స్వచ్ఛంద సేవాసంస్థ మేనేజరు ఎస్ జయకుమార్, అంగన్వాడీలు, టీచర్లు పాల్గొన్నారు.

- స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీఏసీ కోఆర్డినే టరు డాక్టరు పి రాజగోపాలబాబు, అధ్యాపకులు సిహెచ్ శ్రీనివాసరావు, షేక్ షానాజ్‌బేగం, కొమ్మనబోయిన సుజాత, ఐ. అనూష, రామకృష్ణ, మహమ్మద్ మహబూబ్, మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.

- కందుకూరు ఏరియా ఆసుపత్రిలో మహిళా దినోత్సవాన్ని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు శకుంతల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు డాక్టరు ఇంద్రాణి బహుమతులు అందజేశారు.

కావలి, మార్చి 7: కావలి పట్టణ వెంగళరావునగర్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హయ్యాల్ హయ్యూమ్ ఆధ్వర్యంలో పాఠశాల మేనేజిమెంట్ కమిటీ చైర్మన్ అమరజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయినులు బి శాంతకుమారి, బీ శర్వాణి, షేక్ షాబిరా బేగమ్, ఏ లక్ష్మీ, జీ మారమ్మ, వై రజనీ, బీ సుమనా, టీ కనకలక్ష్మీ, వీ హేమలత, షేక్ షఫియా, అనురాధ, టీ రమాదేవి, ఏ అరుణ, ఆర్. మృదుల, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వహకురాలు షేక్ చాన్ బేగమ్, సామాజిక సేవకురాలు కే అశ్వనీ పలువురు ఆయాలను సత్కరించారు.

- **బిట్రగుంట:** బోగోలు మండలం కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ వీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జేఎన్‌టీయుఏ ప్రొఫెసర్ వీబీ చిత్ర, కావలి ప్రముఖ న్యాయవాది జే శ్రీదేవి, వైద్యులు శ్రీరామ్ మధులికలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏవోఆర్ రమణారెడ్డి, హెచ్‌అండ్ ఎస్‌హెచ్‌వోడి డాక్టర్ లక్ష్మీ, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, బీటెక్ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

అల్లూరు: సమాజంలో ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలని అల్లూరు సబ్ రిజిస్ట్రారు ప్రసన్నలక్ష్మి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్లూరులోని సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో దాదాపు 35 ఏళ్లుగా స్వీపర్‌గా పనిచేస్తున్న కోటేశ్వరమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, నాగేశ్వరరావు, శాంతి, సుకన్య, అపర్ణ, దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు పాల్గొన్నారు.

మహాశివరాత్రి పూజల ప్రారంభం

బిట్రగుంట, మార్చి 7: బోగోలు మండలంలోని శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. నాగులవరం పంచాయతీలో గంగాపార్వతి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు జరిగాయి. సాయంత్రం చైన్నారెడ్డి పాలెంలోని నాగులపుట్ట వద్ద పూజలు చేసి పుట్టబంగారాన్ని కాంద్ర కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు.

30 మంది పోలీసులతో బందోబస్తు

లింగసముద్రం, మార్చి 7: మహాశివరాత్రి సందర్భంగా లింగసముద్రంలోని శ్రీ తిరుమణిశెట్టి కోటయ్య మందిరం, మొగిలిచెర్లలోని శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయం వద్ద 30మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు గుడూరు సీఐ జి సుబ్బారావు చెప్పారు. గురువారం సాయంత్రం లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎం బాజీబాబుతో కలిసి ఆయన మాట్లాడుతూ గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం పోలీస్‌స్టేషన్‌లలోని 30 మంది పోలీసులు, తనతో పాటు లింగసముద్రం, గుడ్లూరు, వలేటివారిపాలెం, కందుకూరు రూరల్ పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు బందోబస్తు నిర్వహిస్తారని ఆయన చెప్పారు.

జలదంకిలో కాకర్ల పర్యటన

జలదంకి, మార్చి 7: ఉదయగిరి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ మండలంలో గురువారం పర్యటించారు. ముందుగా ఆయన బీకే అగ్రహారం గ్రామంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బండారు తిరుపతిరెడ్డి ఇంటికి వెళ్ళి తన గెలుపునకు సహకరించాలని కోరారు. అనంతరం కమ్మవారిపాలెం వెళ్ళి టీడీపీ సీనియర్ నాయకుడు పచ్చా పెంచలయ్యనాయుడు తల్లి కౌసల్యమ్మ పెద్దకర్మకు హాజరై ఆమెకు నివాళులర్పించారు. ఇదే కార్యక్రమానికి హాజరైన టీడీపీ జాతీయ నాయకుడు, మాజీ చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ కంచర్ల విజయభాస్కర్‌తో సమావేశమయ్యారు. అనంతరం మండలంలోని బ్రాహ్మణక్రాక గ్రామంలో పలువురు టీడీపీ నాయకులను కలుసుకుని తనకు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్‌ఆర్‌ఐలు వి భాస్కర్ రెడ్డి, కాకర్ల సునీల్, పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా, కాకర్ల సురేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలంటూ జలదంకి మండలానికి చెందిన యువకులు గురువారం సాయంత్రం భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టీడీపీ యువనేతలు గంటా అశోక్, కాసు చెంచు నాయుడు, మహేంద్రరెడ్డి, జనసేన యువనేత నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే న్యాయం చేస్తా : పసుపులేటి

అల్లూరు, మార్చి 7: స్వతంత్ర అభ్యర్థిగా కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే న్యాయం చేస్తా.. ఓడితే సహాయం చేస్తా అని పసుపులేటి సుధాకర్ అన్నారు. అల్లూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ఒరవడిని సృష్టించే మేనిఫెస్టోతో ఎన్నికల బరిలో ఉంటున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకటేశ్వర్లు, ఎల్లు సాల్మన్‌రాజు, దర్శిగుంట వాసు, గోళ్ళ హరికృష్ణ, గుమ్మడి రాజేష్, కాకాని రంగయ్య, ఎల్లు సుబ్రహ్మణ్యం, కర్రా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆశీర్వదించాలి : విజయసాయి రెడ్డి

కావలి టౌన్, మార్చి 7: ప్రజలు ఆశీర్వదిస్తే ఎంపీనవుతానని రాజ్యసభ సభ్యుడు వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ ఆర్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయసాయిరెడ్డికి నియోజకవర్గ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే పరిచయం చేశారు. మూడవ సారి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. సమావేశంలో వైసీపీ కందుకూరు నియోజకవర్గ పరిశీలకుడు సుకుమార్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ దేవరాల సుబ్రమణ్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు. కాగా, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి అన్నపూర్ణ శ్రీనివాసులు విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుల సమక్షంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు ద్రోణాదుల వాసంతి, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వెంకట్రావు దంపతులు, టీడీపీ మాజీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మురళీ తదితరులు టీడీపీని వీడి వైసీపీలో చేరారు.

మామిడి సాగుపై అవగాహన

ఉలవపాడు, మార్చి 7: మామిడి సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, రైల్వేకోడూరుకు చెందిన మామిడి శాస్త్రవేత్త సందీప్ నాయక్‌లు భీమవరం, కే రాజుపాలెం, ఆత్మకూరు పరిసర ప్రాంతాలలో సాగులో ఉన్న మామిడి పూతలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి బీ జ్యోతి, గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

3వ వార్డులో టీడీపీ ఇంటింటి ప్రచారం


ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 7: పట్టణంలోని 3వ వార్డు ఉప్పు చెరువు ప్రాంతంలో టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం సాయ ంత్రం బాబు ష్యూరిటీ - భవిష్య త్తుకు గ్యారంటీ కార్యక్రమం ని ర్వహించారు. సూపర్‌సిక్స్ ప థకాలపై ప్రచారం నిర్వహిం చారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగ నంపటానికి ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పువ్వాడి కోటయ్య, వడ్డెళ్ల రవిచంద్ర, రెబ్బవరపు మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేవయ్య మృతికి సంతాపం

లింగసముద్రం: స్థానిక జంగంరెడ్డిపాలెం గ్రామ టీడీపీ నాయకుడు కొట్టే శేషాద్రి నాయుడు తండ్రి కొట్టే దేవయ్య(80)మృతికి కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఇంటూరి శేషాద్రి నాయుడు ఇంటిని సందర్శించి, దేవయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

- **శేషయ్యకు పరామర్శ**

అలాగే బలిజపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బింకం శేషయ్య మోటారు సైకిల్‌పై నుంచి పడి కాలికి దెబ్బ తగిలి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న నాగేశ్వరరావు శేషయ్యను కూడా పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కండే మాలకొండయ్య, గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య, మైల రామ కేశవులు, జంపాల శివప్రసాద్, కిలారి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై విమర్శలు అర్థరహితం

బిట్రగుంట : టీడీపీ నేతలపై విమర్శలు అర్థరహితం అని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు అన్నారు. బోగోలు మండల టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం జరిగింది. వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు బుధవారం టీడీపీ నాయకులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో ఏ పార్టీకి చెందిన వారైనా మారడం సర్వసాధారణమని అన్నారు. అయితే టీడీపీలో చేరితే వ్యంగ్యంగా మాట్లాడడం వైసీపీలో చేరితే గొప్పగా మాట్లాడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కాంద్ర రఘురామ్ నాయుడు, ఎల్ సుధీర్‌బాబు, కోడూరు వేంకటేశ్వర్లురెడ్డి, పైడిశ్రీహర్ష, బంకాజయరాజ్, పొట్టేల హరిబాబు, నరసింహారావు, చల్లాక్రాంతి, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కావలి, మార్చి 7: కావలి పట్టణ వాయునందన ప్రెస్‌వీధిలో మంచినీటి, మజ్జిగ చలివేంద్రాన్ని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోట్లూరి శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సహకారంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పోట్లూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత మారిశెట్టి శ్రీకాంత్, స్వప్న, కటారి వెంకటేష్, అమరా వెంకటేష్, వెల్లంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌లో వడ్డెరలకు ప్రాధాన్యం : శీనయ్య


మాట్లాడుతున్న పల్లపు శీనయ్య తదితరులు

కావలి, మార్చి7: బీసీ డిక్లరేషన్‌లో వడ్డెరలకు ప్రాధాన్యత కల్పించారని ఏపీ సమైక్య వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు శీనయ్య తెలి పారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయం లో గురువారం ఆయన విలేక రులతో మాట్లాడారు. బీసీలకు 50 ఏళ్లకే రూ.4వేలు పింఛన్ అమలుచేస్తాననటం బీసీల పట్ల వారికున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఉన్న 30 లక్షల మంది వడ్డెరలు టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పసుపులేటి వెంక టేశ్వర్లు, రాపూరు అనిల్‌కుమార్, పల్లపు శివ, మంచాల విజయ్, పల్లపు నారాయణ, పల్లపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల మహాగర్జన సభను జయప్రదం చేయండి

కావలిటౌన్, మార్చి 7: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో ఈనెల 19న అమరావతిలో జరగనున్న దివ్యాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీస్ నాయకులు చేవూరు కిరణ్‌కుమార్ కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మహాగర్జన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో యేసు, రాజ్‌కుమార్, కత్తి శివయ్య, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా కావలి మండల సమావేశం

కావలి రూరల్, మార్చి 7: కావలి పట్టణ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని 17 మంది సర్పంచ్‌లకు గాను ఐదుగురు సర్పంచ్‌లు, 11మంది ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం కాగా, పట్టణంలోని ఆర్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో అదే సమయానికి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డితో నియోజకవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించడంతో సర్వసభ్య సమావేశానికి డుమ్మాకొట్టి సమావేశంలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో జట్పీటీసీ జంపాని రాఘవులు, వైస్ ఎంపీపీలు అరగల కవిత, పామంజి రాజయ్య, ఎంపీడీవో ఏవి క్రిష్ణమోహన్, అన్నిశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయాలి

కందుకూరు, మార్చి 7: శాస్త్రీయ పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయాలని ఐసీఏఆర్ డెరెక్టర్ కమ్ చైర్మన్ డాక్టర్ ఎం శేషుమాధవ్ కోరారు. కందుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో శాస్త్రీయ సలహాసంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న శేషుమాధవ్ మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేలా రైతులను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో దర్శి కేవీకే సమన్వయకర్త డాక్టరు దుర్గాప్రసాద్, ఆత్మ సంచాలకులు అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

ఆయురారోగ్యాలకు నిదర్శనం శివరాత్రి

నెల్లూరు (సాంస్కృతికం) : ఆయురారోగ్యాలకు నిదర్శనం శివరాత్రి అని బ్రహ్మకుమారిల జిల్లా ఇన్‌చార్జి బీకే ప్రసన్న తెలిపారు. శివరాత్రిని పురస్కరించుకుని బ్రహ్మకుమారిలు గురువారం నగర ప్రముఖులతో కలిసి వేదాయపాలెంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈసారి ద్వాదశ జ్యోతిర్లింగాలను విద్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటిని శుక్ర, శనివారాల్లో భక్తులు సందర్శించుకోవాలన్నారు. ఈ యాత్రను జయప్రకాష్, వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. వేదాయపాలెం నుంచి అయ్యప్పగుడి వరకు శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో బ్రహ్మకుమారిలు సుమతి, నిర్మల, లలిత, రాధిక, రమణయ్య, శేషయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వాడవాడలా ముందస్తు మహిళా దినోత్సవం



మహిళలను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

నెల్లూరు (వైద్యం)మార్చి 7: నారాయణ వైద్య కళాశాలలో గురువారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. టీడీపీ నేత నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి మహిళా తన కాళ్లమీద తాను నిలబడేలా జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం వైద్య కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సీనియర్ మహిళా సిబ్బందికి జ్ఞాపికలు అందచేశారు. క్రీడా విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ ప్రతిమ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వనజకుమారి, ఆపరేషన్స్ హెడ్ రామారావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో...

ఇండియన్ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో గురువారం ముందస్తు ప్రపంచ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృమూర్తులను సన్మానించారు. అనంతరం రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో దివ్యాంగుల కేంద్రం కన్వీనర్ నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, బలరామయ్యనాయుడు, ప్రిన్సిపాల్ గురునాథం అరుణ, ములుగు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్‌లో...

నెల్లూరు, (జడ్పీ) : ముందస్తు మహిళా దినోత్సవాన్ని విద్యుత్ భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఈ విజయన్ మాట్లాడుతూ విద్యుత్ సేవలు ప్రమాదకరంగా ఉంటున్నప్పటికి మహిళలు విధులను చక్కగా నిర్వహిస్తున్నారని అన్నారు.కార్యక్రమంలో నగర ఈఈ సోమశేఖర్‌రెడ్డి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ ఆధ్వర్యంలో...

నెల్లూరు(హరనాథపురం) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరిపారు. ఈ వేడుకల్లో భాగంగా లెమన్ అండ్ స్పూన్, అంత్యాక్షరి, ఫ్యాషన్‌షో, పాటల పోటీలు, క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా గౌరవాధ్యక్షుడు వై. రమణారెడ్డి, అధ్యక్షుడు సుధాకరర్‌రెడ్డి, కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్, మహిళా విభాగం చైర్‌పర్సన్ బి.సుగుణ, ఏసీఎస్ఆర్ కళాశాల చైర్‌పర్సన్ కె.లక్ష్మిసునంద, డీపీహెచ్‌ఎన్‌వో జి. మంజుల తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు విద్యాసంస్థల్లో..

నెల్లూరు (విద్య) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని పలు విద్యాసంస్థలు, ఉపాధ్యాయ సంఘాలు ముందస్తు వేడుకలను నిర్వహించారు. డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రమణరావు, అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజోవతి, న్యాయవాది డాక్టర్ సీతా సారంగపాణి, ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ పి.ఉమామహేశ్వరి, సభ్యులు డాక్టర్ సి.కళాప్రియ తదితరులు పాల్గొన్నారు.

● ఎస్‌టీయూ ఆధ్వర్యంలో ఏసీనగర్ ఉన్నత పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వై.అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి జి.రాజమనోహర్ తదితరులు మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం.పి.హైమవతి, ఎస్‌టీయూ ఆర్థిక కార్యదర్శి కె.నరసింహం, రాష్ట్ర కార్యదర్శి పి.సుమన్, ఉపాధ్యాయులు నాగేశ్వరి, జయలక్ష్మి, పద్మశ్రీ, భారతి పాల్గొన్నారు.

● బుజబుజనెల్లూరులోని శేషు ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ బి.శేషు, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయినులను సత్కరించారు.

'నారాయణ మాతృసేవ' ఎంతో గొప్పది : దీపా వెంకట్



నారాయణ మాతృసేవా పథకం కిట్‌ను అందిస్తున్న దీపావెంకట్

నెల్లూరు (వైద్యం) : నారాయణ మాతృసేవా పథకం ఎంతో గొప్పదని స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ అన్నారు. గురువారం నారాయణ ఆసుపత్రి ఆడిటోరియంలో మాతృసేవా పథకం 8వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ నారాయణ మాతృసేవా పథకం ద్వారా 20వేల కాన్పులు జరిగాయంటే పథకం ఎలా అమలు అవుతుందో తెలుస్తునకనదన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌కు 15 ఏళ్లుగా నారాయణ ఆసుపత్రితో అనుబంధం ఉందన్నారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి మాట్లాడుతూ కుటుంబ అభివృద్ధి చెందాలంటే తల్లిగా, భార్యగా, కూతురుగా ఒక మహిళ ఉంటుందనే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా 35 ఏళ్ల నిండిన మహిళలకు ప్రత్యేక హెల్త్ చెకప్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈనెల 8 నుంచి ఏప్రిల్ 7 వరకు హెల్త్‌చెకప్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రత్యేక హెల్త్‌చెకప్ పోస్టర్‌ను విడుదల చేశారు. తదుపరి మహిళలకు మాతృసేవా పథకం కిట్‌లను అందచేశారు. వైద్యులకు, ఉద్యోగులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న, డాక్టర్ మంజుప్రభ, డాక్టర్ రాధిక, శారద, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో ప్రత్యేక అధికారాలుంటాయి.. !

నెల్లూరు(సిటీ) : రానున్న ఎన్నికల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక అధికారాలుంటాయని, వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎంసీ కమిషనర్, సిటీ నియోజకవర్గం ఆర్వో వికాస్ మర్మత్ తెలిపారు. గురువారం కార్పోరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ భవనంలో ఎన్నికల విధులపై అధికారులు, ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిపై పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. అనంతరం టీచర్స్‌కాలనీ, చంద్రమౌళినగర్, రెవెన్యూ కాలనీలోని సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, పన్నుల వసూళ్ల పై సమీక్షించారు.

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ : పందిటి

నెల్లూరు(హరనాథపురం) : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తామని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్యమాదిగ చెప్పారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు స్వతంత్ర అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలుపుతామన్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు బద్దెపూడి వెంకట్రావు, చిన్నయ్య, తాటిపర్తి రఘు, కన్యకేశ్వరరావు, మల్లిఖార్జున, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కందమూరులో ఆదాల పర్యటన

నెల్లూరురూరల్ : నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి గురువారం మండలంలోని కందమూరు, ఉప్పుటూరు గ్రామాల్లో పర్యటించారు. స్థానికంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, మరి కొన్ని పనులను శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎంపీపీ విజయకుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తా : నారాయణ



వృద్ధుడి సమస్యలు తెలుసుకుంటున్న నారాయణ

నెల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే నెల్లూరు నగరంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టున్నింటిని పూర్తిచేస్తానని నెల్లూరు సిటీ టీడీపీ అభ్యర్థి పీ నారాయణ హామీ ఇచ్చారు. గురువారం నగరంలోని 10, 11, 52వ డివిజన్లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటి తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని ముఖ్య నేతలతో గోమతినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో నారాయణ సమావేశమయ్యారు. పార్టీ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మవరం సుబ్బారావు, తాళ్లపాక అనురాధ, మామిడాల మధు, ముప్పాళ్ల విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి 42వ డివిజన్‌లో పర్యటించారు. ముస్లిం మహిళలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీలో చేరగా వారికి రమాదేవి కండువాలు కప్పారు.

● నెల్లూరును నాశనం చేసి నరసరావుపేట వెళ్లాడు..

ఐదేళ్లపాటు నెల్లూరు నగరాన్ని నాశనం చేసి నరసరావుపేటకు వెళ్లారని నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్‌పై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ధ్వజమెత్తారు. గురువారం నగరంలోని 45, 53 డివిజన్లలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జనపల సుధీర్, సుధాకర్‌రెడ్డి, కువ్వారపు బాలాజీ, షేక్ జహీర్, నవీన్, చంద్రమౌళి పాల్గొన్నారు.

● వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

నెల్లూరు(వ్యవసాయం) : వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. నగరంలోని 51వడివిజన్ బీసీ ఆసుపత్రి కాంపౌండ్‌లో గురువారం బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నాయకులు మీదూరి ప్రశాంత్‌కుమార్, కమతం ప్రశాంత్‌కుమార్, ఎంబేటి షైకేల్, అరవ రాజేష్, దాది భాస్కర్‌రావు, ఇంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే భయపెట్టాలనుకుంటోంది...

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఓటమి భయంతోనే వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలను భయపెట్టాలని చూస్తున్నదని జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మంగళగిరిలోని జనసేన సిబ్బంది ఇళ్లల్లో సోదాలు చేయడం సిగ్గుచేటన్నారు.

చంద్రప్రభ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడి దర్శనం



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక రామకృష్ణానగర్‌లోని కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారు చంద్రప్రభ వాహనంపై బుచ్చి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో సుదర్శన నారసింహయాగం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాలకు తుమ్మల పెంచలరెడ్డి, తోట శ్రీనివాసులురెడ్డి కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

రాపూరులో నేదురుమల్లి పర్యటన

రాపూరు(డక్కిలి), మార్చి 7 : తనకు ఒక్క అవకాశం ఇస్తే నిస్వార్థంగా సేవ చేస్తానని వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఓటర్లుకు విజ్ఞప్తి చేశారు. గురువారం రాపూరులో గడపగడప కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మేరిగ మురళీధరరావు, నాయకులు పావకన్ను మధురెడ్డి, దయాకరరెడ్డి, నారాయణరెడ్డి, పట్టాబి రామిరెడ్డి, నెల్లూరు రవీంద్రారెడ్డి ఉన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

మనుబోలు: చెరుకుమూడి పంచాయతీ ముద్దమూడి గ్రామంలో రూ.2.80 కోట్ల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్, ఈఈలు జయకృష్ణారెడ్డి, శ్రీధర్, ఏడీ సురేంద్ర, నాగార్జున్, ఎంపీపీ వజ్రమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి ఉన్నారు. అనంతరం గురివిందపూడి గ్రామానికి చెందిన మన్నెమాల చెంచు కృష్ణారెడ్డి మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి కాకాణి గురువారం గురవిందపూడికి చేరుకొని కృష్ణారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు.

పొదలకూరు: పట్టణంలోని మనుబోలు రోడ్డులో రూ.26లక్షలు వ్యయంతో నిర్మించిన ముస్లిం స్మశాన వాటిక ప్రహరీని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గురువారం ప్రారంభించారు.

ఓటమి భయంతోనే తనిఖీలు

వెంకటాచలం, మార్చి 7 : ఓటమి భయంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం, తమపార్టీ నాయకుల నివాసల్లో ఆకస్మిక తనిఖీలు చేయడాన్ని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన సర్వేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.

వీఎస్‌యూలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వెంకటాచలం, మార్చి 7: కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్ కుమార్ బాబు, డాక్టర్ బీ సుహాసిని ఉన్నారు.

● **తోటపల్లిగూడూరు:** సమాజంలో మహిళ పాత్ర కీలకమని మండల అభివృద్ధి అధికారి నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ గైనకాలజిస్టు వైద్యాధికారి టి.లక్ష్మీ, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ శేషమ్మ, న్యాయవాది పద్మావతి, విజయలక్ష్మీ, రత్నమ్మ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● **ముత్తుకూరు:** అదాని కృష్ణపట్నం పోర్టులో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు పాల్గొన్నారు. అదాని కృష్ణపట్నం పోర్టు మహిళ ఉద్యోగులు, కార్మికులతో కేకని కట్ చేయించారు. దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు వివిధ విభాగాల్లో ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోర్టు ఉద్యోగులు, కార్మికలు పాల్గొన్నారు.

● **పొదలకూరు:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని మొగళ్లూరు గ్రామ అంగన్వాడీ కార్యకర్త బుజ్జమ్మ గోలీ, టాబ్లెట్, వెల్లుల్లిపై మహిళా చిత్రాలను అద్భుతంగా చిత్రించారు.

● **బుచ్చిరెడ్డిపాళెం:** బుచ్చి నగర పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలలో గురువారం జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ మెప్మాలోని సీఓ నర్మదను, పలువురు వీఓఏలను నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ సత్కరించారు.

భారీ మెజారిటీతో గెలిపిస్తాం



నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి7: కోవూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేకి 40వేలుతో, ఎంపీకి 50వేల ఓట్ల మెజారిటీతో గెలిపించుకుంటామని పోలంరెడ్ల సమక్షంలో బుచ్చి మండలంతోపాటు నియోజకవర్గ స్థాయిలో కొత్త, పాత నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు ముక్తకంఠంతో ఎమ్మెల్యే అభ్యర్థి పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డికి భరోసా ఇచ్చారు. గురువారం బుచ్చిలోని లోటస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో మండల అధ్యక్షుడు ఎంవీ శేషయ్య అధ్యక్షతన టీడీపీ నాయకులు, కార్యకర్తలు క్లస్టర్, యూనిట్ బూత్ కన్వీనర్లతో శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. కోవూరు నియోజకవర్గంలో టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించ డమే లక్ష్యంగా రానున్న 45రోజులు అహర్నిశలు కష్టపడతామని చెప్పారు. ఉదయం నగర పంచాయతీలోని 7వ వార్డులో ఆవార్డు ఇన్‌చార్జ్ షబ్బీర్‌తో కలిసి దినేష్‌రెడ్డి ప్రతిఅడుగు ప్రజల కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, రామానాయుడు, చైతన్య, పురుషోత్తం, బాలాకుమార్, కోదండరామిరెడ్డి, కొండయ్య, హరనాధ్, బచ్చాబాయ్, పెంచలయ్య, సుల్తాన్ షబ్బీర్ భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోవూరులో విజయసాయిరెడ్డి పరిచయ సభ

కోవూరు, మార్చి 7: నెల్లూరు పార్లమెంటు స్థానానికి వైసీపీ అభ్యర్థిగా పోటీచేయనున్న రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డిని గురువారం స్థానిక రుక్మిణీ కల్యాణ మండపంలో ఆ పార్టీ నాయకులకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ్యుడు బీద మస్తాన్ రావు, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి, నాయకులు దొడ్డంరెడ్డి నిరంజన బాబురెడ్డి, వీరి చలపతిరావు, నల్లపరెడ్డి రజితకుమార్‌రెడ్డి. నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరుని తప్పుదోవ పట్టించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

● తహసీల్దారుకు రైతు ఫిర్యాదు

విడవలూరు: స్పందన కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదులకు తప్పుడు నివేదికలు అందజేసి జిల్లా కలెక్టరుని సైతం మండల రెవెన్యూ అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని విడవలూరుకి చెందిన రైతు మాతూరు శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. కోర్టులో కేసు నడుస్తున్న పొలానికి డీఎల్‌ఆర్‌లో పేర్లు మార్చి పాస్ పుస్తకాలు ఇవ్వటాన్ని తప్పుబడుతూ సోమవారం ఆయన తహసీల్దారు శ్రీనివాసులుని కలసి ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వీఆర్సీ మైదానం పరిశీలన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరులో శనివారం జరగనున్న బీజేపీ సభకు వీఆర్‌సీ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లును ఆపార్టీ నాయకులు గురువారం పరిశీలించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి ఏర్పాట్లను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వంశీధర్‌రెడ్డి, పీ సురేంద్ర రెడ్డి, రఘునాథరాజు, యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200


మహిళా దినోత్సవ ప్రత్యేకం

శ్రీసిటీ ప్రతినిధి

'ఆకాశంలో సగం' అన్నది ఒక ఆకాంక్ష. వివక్ష, స్త్రీ నిరసన స్వరం. అణచివేతపై ధిక్కార నినాదం.

'అవనిలో సగం' అన్నది ఒక నిజం. ప్రపంచ జనాభాలో పురుషులకన్నా స్త్రీల సంఖ్యే అధికం.

అయినా సకల రంగాల్లోనూ, సకల అంశాల్లోనూ చిన్నచూపు. చులకనభావం. అనుమానం.. అవమానం.. నీడలా వెంటాడే వాస్తవం. మనుధర్మం పేరుతో సాగిన వందల యేళ్ల వివక్ష ఇంకానా.. ఇకపై చెల్లదంటూ ఆడవాళ్లు పిడికిళ్లెత్తి నిరూపిస్తున్నారు. ఎక్కడైనా..ఎప్పుడైనా.. ఏ పనిలో అయినా తగ్గం అంటూ సవాలు విసురుతున్నారు. పార్లమెంటు సహా ఏ చట్ట సభల్లోనూ లేని సమాన భాగస్వామ్యాన్ని పరిశ్రమల్లో సాధించి నిరూపించారు. అందుకు సాక్ష్యమే తిరుపతి జిల్లాలోని శ్రీసిటీ. దేశంలోనే అత్యద్భుత ఫలితాలను రాబట్టిన శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలో 220 పరిశ్రమలున్నాయి. వీటిలో 59 వేల మంది ఉద్యోగులున్నారు. వీరిలో 30 వేల మందికి పైగా మహిళలే కావడం శ్రీసిటీ ప్రత్యేకత. మెట్రో రైళ్ల మొదలు, కోల్గేట్ బ్రష్‌ల దాకా మహిళల చేతుల్లో ఇక్కడ రూపుదిద్దుకుంటున్నాయి.



స్త్రీసిటీగా ఇలా మారింది...


మహిళా సాధికారతకు శ్రీసిటీ సజీవ నిదర్శనం. ఆర్థిక స్వావలంబన గల స్త్రీలు లింగ వివక్షను ప్రశ్నిస్తారు. అణచివేతను ఎదుర్కొంటారు. ఆత్మాభిమానంతో వ్యవహరిస్తారు. అన్నింటికన్నా ముఖ్యంగా తమ బిడ్డల బంగారు భవిష్యత్తుకు బాటలు పరుస్తారు. సత్యవేడు, వరదయ్యపాళెం, తడ, సూళ్లూరు పేట ప్రాంతాల్లోని మహిళల జీవనశైలిలో వచ్చిన మార్పే ఇందుకు సాక్ష్యం. మగవాళ్లలా సంపాదించినదంతా తాగుడుకు తగలేయరు. ప్రతి రూపాయినీ అపురూపంగా కుటుంబం కోసం ఖర్చు చేస్తారు. ఈ ఆత్మవిశ్వాస భాగస్వామ్యం శ్రీసిటీ పరిధిలోని అనేక గ్రామాల రూపురేఖల్లోనే మార్పునకు కారణం అవుతోంది. స్త్రీలు సునిశితంగా, మరింత దీక్షగా, శ్రద్ధగా, నైపుణ్యంతో పనిచేస్తారు. సవాలక్ష పనులు ఏకకాలంలో చేసే స్కిల్ స్త్రీలకు కుటుంబం నేర్పింది. ఇదే పరిశ్రమలకు ప్రయోజనకర అంశంగా మారింది. ఉత్పాదకతనూ, నాణ్యతనూ పెంచింది. దీంతో స్థానిక మహిళలకు అవసరమైన శిక్షణ ఇచ్చి పరిశ్రమల్లోకి తీసుకుంటున్నారు. పల్లెలను పరిశ్రమల్లోకి ఒక ప్రవాహంలా ఇప్పుడు స్త్రీలు వస్తున్నారు. భారతదేశ పారిశ్రామిక చిత్రపటంలోనే ఒక విభిన్నమైన స్థానాన్ని ఆడవాళ్లు శ్రీసిటీకి సాధించి దానిని స్త్రీ సిటీగా మార్చేశారు. ఇప్పుడీ పారిశ్రామిక మండలి సిరిసిటీగా విలసిల్లడానికి స్త్రీల భాగస్వామ్యమే ప్రధానంగా మారింది.

కదిలే మహిళా శక్తి

పరిశ్రమల బస్సుల్లో, ఆటోల్లో యూనిఫారాల్లో ఆడవాళ్ల సమూహాలుగా కదిలిపోయే అరుదైన దృశ్యం ఇక్కడ కనిపిస్తుంది. బొమ్మలు తయారు చేసే సంస్థ పాల్స్ ఫ్లష్‌లో 95 శాతం ఆడవాళ్లే ఉన్నారు. ఎంఎస్ఆర్ గార్మెంట్స్‌లో 92 శాతం స్త్రీలు పనిచేస్తున్నారు. బ్లూస్టార్‌లో 600మంది ఉద్యోగులుంటే 300మంది మహిళలే. భారత్ ఎఫ్ఐజీ (ఫాక్స్‌కాన్ గ్రూప్) మొబైల్ తయారీ కంపెనీలో 5,000మంది ఉంటే 4,500మంది మహిళలు, జెన్ లినెన్‌లో 550మంది ఉద్యోగుల్లో 380మంది మహిళలున్నారు. 350 మంది చేసే ఎవర్డన్ టీలో 330మంది మహిళలే ఉన్నారు.

ఈ పరిశ్రమల్లో అందరూ స్త్రీలే

కొన్ని పరిశ్రమల్లో అయితే కేవలం మహిళలు మాత్రమే పనిచేస్తుండడం మరీ విశేషం. స్థానిక మహిళలకు ఇదొక వరంగా మారింది. కోల్గెట్ (టూత్ బ్రష్‌లు), ఎవర్డన్ టీ, క్యాడ్బరీ చాక్లెట్లు, జెన్ లెనిన్ (సింథటిక్ ఫైబర్ పరుపులు, దిళ్ళు, దుప్పట్లు), ఎంఎస్ఆర్ గార్మెంట్స్ (సూట్లు), ఫాక్స్‌కాన్ (మొబైల్ ఫోన్లు), బ్లూస్టార్, డైకిన్, హావెల్స్ (ఎయిర్ కండిషనర్లు), ఆల్‌స్టమ్ (మెట్రో రైళ్ల)లో మహిళా కార్మికుల పాత్ర ప్రముఖమైనది.



పరిశ్రమల్లోనూ సగం

చెల్లెళ్లను చదివిస్తున్నా

మా తల్లిదండ్రులకు ముగ్గురు ఆడ సంతానం. మా నాన్నది చిన్న ప్రైవేటు ఉద్యోగం. నేను పెద్ద దానిని. నేను 12వ తరగతి వరకు గురుకుల పాఠశాలలో చదివా. ఆపై సూళ్లూరుపేటలో ఓ ప్రైవేటు కళాశాలలో బీ ఫార్మసీ పూర్తిచేశా. వెంటనే శ్రీసిటీలోని క్యాడ్బరీ కంపెనీలో ఉద్యోగంలో చేరి నాలుగేళ్లు పని చేశా. ఆపై నా చదువుకు తగ్గ ఉద్యోగం దొరకడంతో ప్రస్తుతం ఎక్సలెంట్ ఫార్మా పరిశ్రమలో క్వాలిటీ డివిజన్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఏడాదిగా పని చేస్తున్నా. నా సంపాదనతో నా ఇద్దరి చెల్లెళ్ల చదువుకు ఆసరాగా నిలిచా. ఒకచెల్లి పెళ్లికి రూ.5 లక్షలు సాయం చేయగలిగా.

- సౌజన్య, సూళ్లూరుపేట

ఊరి దగ్గరే ఉద్యోగం

మాది వరదయ్యపాలెం రైతు కుటుంబం. బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదివా. చదువు పూర్తయ్యే సమయంలోనే పెళ్లి, ఆపై ఇద్దరు పిల్లలు. ఇక కుటుంబానికి దూరంగా నగరాలకు వెళ్లి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే అవకాశం లేదు. అయితే గ్రామానికి అతి సమీపంలో శ్రీసిటీ రూపంలో మరో అవకాశం వచ్చింది. మొదట తోహరాకు స్టీల్స్, ప్రస్తుతం వీఆర్‌వీ పరిశ్రమలో ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నా.

- బి.మనీష, వరదయ్యపాళెం



టెక్స్‌టైల్ టెక్నాలజీలో ఇంజనీరింగ్ చేసిన నేను పెళ్లికి ముందు చెన్నై పరిసరాల్లో ఉద్యోగం చేసేదానిని. పెళ్లి తర్వాత అక్కడ ఉద్యోగం మానేసి సత్యవేడు వచ్చా. మెట్టినింటికి వచ్చాక భర్త, అత్తమామల ప్రోత్సాహంతో సమీపంలోనే శ్రీసిటీ జెన్‌లెనిన్ వస్త్ర పరిశ్రమలో సేల్స్ అండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం లభించింది. రెండేళ్లుగా పని చేస్తున్నా.

- మీనాక్షి, సత్యవేడు



నేను బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ చేసి గతంలో ఉత్తర భారత్‌లోని రెండు ప్రాంతాల్లో పని చేశా. నా భర్త శ్రీసిటీలో మొండెలెజ్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్న కారణంగా ఈ ప్రాంతానికి వచ్చి నాలుగేళ్లుగా జెన్‌లెనిన్ వస్త్ర పరిశ్రమలో క్వాలిటీ డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నా.

- సుస్మిపల్లవి సాహూ, ఒడిశా

వేడెక్కిన తిరుపతి రాజకీయం

- పవన్ తప్ప బయటి వారు గెలవడం కష్టం!
- అచ్చెన్నకు తేల్చి చెప్పిన తిరుపతి టీడీపీ నేతలు
- ఉమ్మడి అభ్యర్థి ఎంపికపై కొనసాగుతున్న ప్రతిష్టంభన

తిరుపతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ సీటు పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తిరుపతి టీడీపీ నేతలు నరసింహ యాదవ్, సుగుణమ్మలకు స్పష్టం చేశారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి పిలిపించిన అచ్చెన్నాయుడు తిరుపతికి ఉమ్మడి అభ్యర్థిగా ఎవరు ఖరారైనా వారి గెలుపుకోసం సహకరించాలని చంద్రబాబు మాటగా చెప్పారు. అయితే తిరుపతిలో పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే పర్వాలేదని, అలాకాక స్థానికేతర అభ్యర్థి అయితే గెలవడం కష్టమని వారు కూడా అచ్చెన్నాయుడికి తేల్చి చెప్పేశారు. పార్టీ ఆవిర్భావం నుంచీ తన కుటుంబం తిరుపతిలో టీడీపీ కోసం కష్టపడి పనిచేస్తోందని, గత నాలుగు ఎన్నికల్లో టికెట్ ఆశించినా అవకాశం దక్కలేదని అచ్చెన్న ఎదుట నరసింహ యాదవ్ వాపోయారు.అనంతరం మనస్తాపంతోనే తిరుపతికి వెనుదిరిగారు.

టికెట్ ఇస్తే జనసేనలో చేరేందుకు సుగుణమ్మ సిద్ధం

టీడీపీ టికెట్‌పై గంపెడు ఆశ పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కూడా తిరుపతి సీటును మిత్రపక్షమైన జనసేనకు కేటాయించడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. అయితే ఉమ్మడి అభ్యర్థిగా టికెట్ దక్కేటట్టు అయితే జనసేనలో చేరేందుకు సిద్ధంగా వున్నట్టు తెలిసింది.జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలవడానికి యత్నిస్తున్నట్టు తెలిసింది.ఆయన ఢిల్లీ నుంచీ మంగళగిరి వచ్చాక కలిసే ఉద్దేశంతో సుగుణమ్మ అక్కడే వున్నారని సమాచారం.ఆశావహులందరిలోనూ తనకే గెలుపు అవకాశాలు అధికంగా వున్నాయని, ఆ మేరకు టికెట్ ఇవ్వాలని జనసేన అధినేతను కోరనున్నట్టు తెలిసింది. గురువారం తిరుపతి టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్ మంగళగిరిలో పవన్ కళ్యాణ్‌ను కలిశారు. ఉమ్మడి అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. తిరుపతిలో అభ్యర్థి ఎవరైతే విజయావకాశాలు అధికంగా వుంటాయో తెలుసుకునేందుకు సర్వేలు నిర్వహిస్తున్నామని, వాటి ఫలితాలు వచ్చాక నిర్ణయం తీసుకుంటామని పవన్ స్పష్టం చేసినట్టు తెలిసింది. చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేన పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన తిరుపతి జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ కూడా పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌లను కలిశారు.చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతి జనసేన టికెట్ రేసులో వున్నట్టు ప్రచారమవుతున్న సంగతి తెలిసిందే. అయితే గురువారం ఆయన మంగళగిరిలో జనసేన పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ శ్రీనివాసులు ఎలాంటి షరతులు లేకుండా, టికెట్ కూడా ఆశించకుండా జనసేనలో చేరుతున్నారని ప్రకటించారు. ఈ వ్యాఖ్యతో శ్రీనివాసులుకు తిరుపతి టికెట్ విషయమై పార్టీ వర్గాల్లో అనుమానాలు తలెత్తాయి.

జనసేన టికెట్ తిరుపతి బలిజలకే ఇవ్వాలి!

తిరుపతి జనసేన టికెట్ స్థానికంగా వున్న బలిజలకే కేటాయించాలన్న డిమాండ్ ఊపందుకుంది. గురువారం బలిజసేన ఆధ్వర్యంలో మన తిరుపతి -మన బలిజలు- మన సీటు అనే నినాదంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.రాయలసీమ వ్యాప్తంగా చూస్తే తిరుపతిలో బలిజలు అధిక సంఖ్యలో వున్నారని, జనసేన గెలిచే మొదటి సీటు కూడా తిరుపతే అవుతుందని అభిప్రాయపడ్డారు. అంగబలం, అర్థబలం చూపి టికెట్ తెచ్చుకునే స్థానికేతరులకు తాము సహకరించబోమని తేల్చి చెప్పారు. స్థానిక బలిజలకే టికెట్ ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.స్థానికులకే అసెంబ్లీ టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ ముందుముందు బలపడే పరిస్థితి కనిపిస్తోంది.మొత్తం మీద పవన్ కళ్యాణ్ ఢిల్లీ నుంచీ మంగళగిరి వచ్చాకే తిరుపతి సీటుపై దృష్టి సారించే అవకాశముంది. ఎలా చూసినా మరో వారం రోజుల పాటు తిరుపతి ఉమ్మడి అభ్యర్థి ఎంపికపై సస్పెన్స్ కొనసాగనుంది.

శేష వాహనంపై శివయ్య చిద్విలాసం

శ్రీకాళహస్తి, మార్చి 7: నాగభూషణుడైన శివయ్య ఆదిశేషుని పడగ నీడలో గురువారం రాత్రి భక్తులకు శోభాయమానంగా దర్శనమిచ్చారు. ఆయన దేవేరి జ్ఞానాంబిక అమ్మవారు యాళి వాహనంపై కటాక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజును నాగరాత్రిగా ఆరాధించారు. ఉదయం బంగారు హంస వాహనంపై స్వామి, చిలుక వాహనంపై అమ్మవారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శేష వాహనంపై పరమశివుడు, యాళి వాహనంపై పార్వతీదేవి, ముందుగా మూషిక వాహనంపై వినాయక స్వామి, చప్పరాలపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప పరివారంగా సాగింది. కళాకారుల కోలాటాల నడుమ శివనామస్మరణతో పురవీధులు మార్మోగాయి. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



నిమ్మ అధరహో



గూడూరు అర్బన్, మార్చి 7 : వేసవి ప్రారంభంలోనే నిమ్మ ధర అదరగొడుతోంది.వినియోగదారులకు కాస్త భారం అనిపిస్తున్నా, కర్షకులకు మాత్రం కాసులు కురిపిస్తోంది.గూడూరు మార్కెట్‌లో గురువారం కిలో నిమ్మకాయలు రూ.70తో మొదలై రూ.85 వరకు పలికింది.80కిలోల బస్తా సుమారు రూ.6,500 పలికింది. గతేడాది ఇదే సమయంలో కిలో రూ.50కు మించింది లేదని వ్యాపారులు చెబుతున్నారు.ఈ ఏడాది ప్రారంభంలో రూ.40తో మొదలైన ధరలు ప్రస్తుతం రూ.80 వద్ద స్థిరంగా ఉండడంతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మరింత పెరిగి కిలో రూ.200కు చేరుకో వచ్చునని నిమ్మరైతులు ఆశిస్తున్నారు.

వైసీపీ కార్యకర్త వీరంగం

శ్రీకాళహస్తిలో టీడీపీ ప్రచార రథం లైటు ధ్వంసం, డ్రైవర్‌పై పిడిగుద్దులు

- ఆపై నడిరోడ్డుపై ఆర్టీసీ బస్సుకు అడ్డంగా పడక సీన్
- అర్ధగంటపాటు స్తంభించిన ట్రాఫిక్



రోడ్డుపై బస్సుకు అడ్డుగా పడుకున్న బత్తెయ్య

శ్రీకాళహస్తి మార్చి 7: శ్రీకాళహస్తిలో బత్తెయ్య అనే వైసీపీ కార్యకర్త రెచ్చిపోయాడు. టీడీపీ ప్రచార రథం, డ్రైవర్‌పై దాడిచేయడమే కాక, నడిరోడ్డుపై బస్సుకు అడ్డుగా పడుకుని వీరంగం చేశాడు. దీన్ని చూసిన స్థానికులంతా ఏం జరుగుతుందో అర్థంకాక హడలిపోయారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం ఓ తెలుగు మహిళను టీడీపీ ప్రచార రథంలో ఎక్కించుకుని శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయం వద్ద దింపేందుకు డ్రైవర్ కిరణ్ బయల్దేరాడు. సరిగ్గా పురపాలక కార్యాలయం వద్దకొచ్చేసరికి శ్రీకాళహస్తి పట్టణ శివారు ఈదుల గుంట ప్రాంతానికి చెందిన వైసీపీ కార్యకర్త బత్తెయ్య.. ఎంఎస్ఆర్ అనే స్టిక్కర్ వేసుకుని ఉన్న తన ద్విచక్ర వాహనాన్ని టీడీపీ ప్రచార రథానికి అడ్డుగా పెట్టాడు. దుర్భాషలాడుతూ ప్రచార రథం లైటును ధ్వంసం చేశాడు. మద్యం మత్తులో ఉన్న అతను డ్రైవర్‌ని బయటకు లాగి మరీ అందరూ చూస్తుండగానే పిడిగుద్దులు కురిపించాడు. తప్పించుకోవడానికి ప్రయత్నించినా వదలకుండా వెంటాడి మరీ కొట్టాడు. ఎట్టకేలకు తప్పించుకున్న కిరణ్ తమ పార్టీ నాయకులకు విషయం ఫోన్లో తెలిపాడు. టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. దాంతో వైసీపీ కార్యకర్త నడిరోడ్డుపై ఆర్టీసీ బస్సుకు అడ్డంగా పడుకున్నాడు. ఇదంతా చూసిన జనమంతా నివ్వెర పోయారు. వీరంగం చేస్తున్న యువకుడిని ప్రశ్నించేందుకు కూడా హడలిపోయారు. అతను మాత్రం జగనే రావాలి.. జగన్ కావాలి అంటూ.. నినాదాలు చేస్తూ రోడ్డుపై నుంచి 20నిమిషాల పాటు లేవలేదు. దీనివల్ల ఆ ప్రాంతమంతా ట్రాఫిక్ స్తంభించింది. శ్రీకాళహస్తి రెండు పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని పక్కకు లాగారు.





పగిలిన టీడీపీ ప్రచార రథం లైటు

నెల కిందట కూడా..

నెల రోజుల కింద కూడా శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ వద్ద టీడీపీ ప్రచార రథాన్ని ముగ్గురు వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. ఈ ఘటనతో అప్పట్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలు ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేశారు. మళ్లీ శ్రీకాళహస్తిలో అదే తరహాలో ప్రచార రథంపై గురువారం వైసీపీ కార్యకర్త రెచ్చిపోవడం గమనార్హం.



గాయని పి. సుశీలకు డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకుంటున్న విద్యార్థినులు

లింగ సమానత్వంతోనే దేశానికి విశ్వ గురుస్థానం

పద్మావతి వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7:లింగ సమానత్వం సాధించడం ద్వారానే మన దేశం విశ్వ గురువుగా నిలవడానికి అవకాశం కలుగుతుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఛాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ లింగ సమానత్వమనేది మహిళా సాధికారతకు సంబంధించిన అంశం మాత్రమే కాదనీ, ఇది దేశాభివృద్ధితోనూ ముడిపడి ఉన్న విషయమని చెప్పారు. లింగ సమానత్వపు అంతిమ లక్ష్యం స్త్రీ, పురుషులు సమాన హక్కులు పొందడమే అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి పద్మావతి యూనివర్సిటీ దోహదం చేస్తోందని కితాబిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇస్రో రిటైర్డు శాస్త్రవేత్త మంగళ మణి మాట్లాడుతూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా తాము ఎంచుకున్న రంగంలో రాణించే అవకాశం మహిళలకు ఉంటుందన్నారు.తాను టెక్నాలజీ వైపు ఆసక్తి పెంచుకోవడానికీ, ఇస్రో శాస్త్రవేత్తగా రాణించడానికీ తల్లిదండ్రుల ప్రోత్సాహం, దేవుడి దయతో పాటు ఆత్మ స్థైర్యం చాలా ఉపయోగపడిందన్నారు.అంటార్కిటిక్ ఎక్స్‌పెడిషన్ కోసం 400 రోజుల ప్రయాణంలో ఎన్నో సవాళ్ళు ఎదుర్కొన్నానని గుర్తు చేసుకున్నారు.ఓ మహిళగా ఈ సమస్యలన్నింటినీ ఆత్మ స్థైర్యంతోనే పరిష్కరించుకున్నానన్నారు.వీసీ ప్రొఫెసర్ భారతి, మాట్లాడుతూ పి.సుశీల వంటి అద్వితీయమైన గాయనికి గౌరవ డాక్టరేట్ అందించడం మహిళా యూనివర్సిటీకి గర్వకారణమన్నారు. ఈ తరం విద్యార్థినులు సుశీల చేసిన కృషి నుంచీ స్ఫూర్తి పొందాలని సూచించారు. మహిళాభివృద్ధిలో నాలుగు దశాబ్దాలుగా తన వంతు కృషి చేస్తున్న పద్మావతి వర్సిటీ జాతీయ, అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలతో ఒప్పందాలు చేసుకొని బోధన, పరిశోధనల్లో పరస్పరం సహకరించుకుంటున్నట్టు తెలిపారు.అనంతరం ప్రముఖ గాయని పి. సుశీలకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. గౌరవ డాక్టరేట్, ధృవీకరణ పత్రం, జ్ఞాపికతో సుశీలను సత్కరించారు. ప్రతిభ కనబరిచిన 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. సైన్స్ విద్యార్థినులు 30మంది, ఆర్ట్స్ విద్యార్థినులు 21మంది, ఇంజనీరింగ్ విద్యార్థినులు ఆరుగురు బంగారు పతకాలు స్వీకరించగా 12 మంది ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు పుస్తక బహుమతులు అందుకున్నారు. నలుగురు ఆర్ట్స్, ఇంజనీరింగ్ విద్యార్థులు నగదు బహుమతులు పొందారు.పీహెచ్‌డీలు 86మందికి, ఇద్దరికి ఎంఫిల్, పీజీ పట్టాలు 771మందికి, డిగ్రీ పట్టాలు 872మందికి, దూరవిద్యకు సంబంధించిన డిగ్రీలు 72మందికి, పీజీ పట్టాలు 50 మందికి అందజేశారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చిల్లకూరు మండలం ఏరూరు సముద్రతీర ప్రాంతంలో మంచాల సనత్‌కుమార్ రూపొందించిన మహిళ సైకత శిల్పమిది. - చిల్లకూరు

టీడీపీ పాలనలోనే మహిళల రక్షణ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, మార్చి 7: మహిళల రక్షణకు పాటుపడేది టీడీపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. గురువారం స్థానిక అళగనాధస్వామి ఆలయవీధి, బజారువీధిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మహిళల అభివృద్ధికి చంద్రబాబునాయుడు ఎన్నో సంక్షేమపథకాలను అమలు పరిచారన్నారు. డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహాశక్తిపథకం ద్వారా అనేక సంక్షేమ పథకాలను మహిళలకు అమలుపరిచేలా మినీమేనిఫెస్టోను రూపొందించడం జరిగిందన్నారు. మహిళలందరూ టీడీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బత్తిన సుధాకర్, పూర్ణచంద్రరావు, ప్రణీత్, చరణ్, సోమిశెట్టి చెంచు రామయ్య, మట్టం శ్రావణి, భారతి, ప్రకాష్, సుమన్, గోపి, నాగరాజు, నంద, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న జడ్జి అనుషా

బాలయపల్లి, మార్చి 7: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండాలని వెంకటగిరి సివిల్ జడ్జి అనుషా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని గురువారం టీవీఎస్ ఆధ్వర్యంలో టీచర్స్ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి దిశగా ప్రభుత్వాలు ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఇంటి పనులకే పరిమితం కాకుండా ఉపాధి, వ్యాపారాలు, ఉన్నతమైన స్థానాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం జమునారాణి, టీవీఎస్ ఎఫ్‌డీ జయసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

సూళ్లూరుపేట, మార్చి 7: సూళ్లూరుపేట నుంచి వాటంబేడుకు వెళ్లే మార్గంలో రైల్వేగేటు సమీపంలో గురువారం అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్ ప్రమాదం నుంచి బయటపడ్డారు. ట్రాక్టర్‌ను ఎక్స్‌కవేటరు సాయంతో బయటకు తీశారు.


వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

దొరవారిసత్రం, మార్చి 7: మండల పరిధిలోని దుప్పలవారికండ్రిగ - తుంగమడుగు గ్రామాల మధ్య కాళంగి నదిపై రూ.13.30 లక్షలతో నిర్మించనున్న వంతెనకు గురువారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, దువ్వూరు గోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు దేవారెడ్డి సుధాకరరెడ్డి, సర్పంచు మధురెడ్డి పాల్గొన్నారు.

చెట్టు పడి యువకుడి మృతి

బాలాయపల్లి, మార్చి 7: చెట్టు మీద పడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కామకూరులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని కామకూరు గ్రామానికి చెందిన కూని వెంకటేశ్వర్లు, పద్మావతి దంపతుల కుమారుడు శివబాబ్జి(23) బుధవారం జామాయిల్ చెట్లను నరుకుతున్న కూలీలకు భోజనం తీసుకువెళ్లాడు. పక్కన నిలుచుని ఉండగా ప్రమాదవశాత్తు ఓ చెట్టు శివబాబ్జిపై పడింది. స్పృహ లేకుండా పడిపోయిన అతడిని వెంటనే నాయుడుపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మాజీ మంత్రి రాజ్యలక్ష్మి గురువారం బాజ్జి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట వెందోటి కార్తిక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు: కురుగొండ్ల



టీడీపీ మేనిఫెస్టో బ్రోచర్లు అందజేస్తున్న కురగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, మార్చి 7: వైసీపీకి ఇవే చివరి ఎన్నికలని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని 12వ వార్డులో ఆయన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ గాలి వీస్తోందని, వైసీపీ నామరూపాలు లేకుండా కొట్టుకు పోవడం ఖాయమన్నారు. ఎన్నికల తరువాత జగన్ మళ్లీ చంచల్‌గూడ జైలుబాట పట్టాల్సిందేనని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ముఖ్యమంత్రి జగన్ మళ్లీ ఎలాగైనా గెలవాలని చూస్తున్నారని, ఆయన ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఈ దపా ఎన్నికల్లో వైసీపీకి 20 సీట్లకు మించి రావన్నారు. టీడీపీ, జనసేన 155 స్థానాల్లో విజయకేతనం ఎగరవేస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, అక్రమాలు, అడ్డగోలుగా దోచుకోవడం తప్ప అభివృద్ధి జాడే లేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. స్థానికుడైన తనకు వెంకటగిరి ప్రజలు పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని జిల్లాలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని చెప్పారు. కేవీకే ప్రసాద్ నాయుడు, పులికోల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, గంగాధర్, విశ్వనాథనాయుడు, వల్లభనేని మధు నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



విద్యుత్ దీపాలంకరణలో సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయం

సూళ్లూరుపేట, మార్చి 7: మహాశివరాత్రి ఉత్సవాలకు నాగేశ్వర స్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. గురువారం ఆలయంలో హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 11 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు. అదేవిధంగా మన్నారుపోలూరులోని సంతానేశ్వర స్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి నుంచి శివరాత్రి వేడుకలు ప్రారంభం అయ్యాయి. కాళంగి నది నుంచి జలాలు తెచ్చి భక్తులు ఇక్కడి శివుడి విగ్రహాన్ని అభిషేకిస్తారు.

కోట: మండల పరిధిలోని గూడలి కొండపై వెలసిన్న పర్వతవర్ధిని సమేత భీమేశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం స్వామివారికి కళ్యాణం వైభవంగా జరగనుంది. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, కొండపైకి ఉచిత వాహన సౌకర్యం కల్పించనున్నారు. ఆలయ మాజీ చైర్మన్ పల్లెమల్లు విజయసారథిరెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, వరదారెడ్డి ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాలాయపల్లి: మండలంలోని సుబ్రహ్మణ్యం గ్రామంలో వెలసిన సుబ్రమణ్యం దేవస్థానం శివరాత్రి మహోత్సవాలకు ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. శుక్రవారం ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, 7గంటలకు గణపతిపూజ, 8 గంటలకు నవగ్రహ హోమం, 9గంటలకు మహన్యాస పూర్వ ఏకాదశి రుద్రాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మహానైవేద్యం, 1 నుంచి రాత్రి 10 గంటల వరకు అర్చనలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వెంకటగిరిటౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని స్థానిక కాశీవిశ్వనాధస్వామి దేవాలయం, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్ద ఉన్న మల్లిఖార్జున ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు.

ఆశీర్వదించండి... అందుబాటులో ఉంటా: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయశ్రీ

నాయుడుపేట టౌన్, మార్చి 7: వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఉన్న శ్రీనివాస మినీ ఫంక్షన్ హాల్‌లో గురువారం నాయుడుపేట మండల టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య వృత్తిని వదిలి ప్రజాసేవకోసం వచ్చానని... ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ సీనియర్ నేత శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు వేనాటి సతీష్‌రెడ్డి, చెన్నకేశవులు, పల్లమాల రామిరెడ్డి, శ్రీరామ్‌ప్రసాద్, సూరి, రత్నం, అవధానం సుధీర్, సుబ్బరాయులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగివుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం

గూడూరు, మార్చి 7: మహిళలు తమ హక్కులపై, చట్టాలపై అవగాహన కలిగివుండాలని ఏడవ అదనపు జిల్లా జడ్జీ షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. గురువారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవిజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. తమ హక్కులపై అవగాహన కలిగి వుండి వాటిని సాధించుకుని పురుషులకు ధీటుగా మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మురళీధర్, బీవీ సులోచనారాణి, న్యాయవాదులు అరవ పార్వతయ్య, మెహబూబ్‌బాషా, రామసుబ్బయ్య, అధ్యాపకురాలు గాయత్రి, కోర్టు సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కరబల్లవోలు - అయ్యవారిపాళెం రోడ్డుకు శంకుస్థాపన

ఓజిలి, మార్చి 7: ఓజిలి మండలం కరబల్లవోలు నుంచి చిల్లకూరు మండలం అయ్యవారిపాళెం వరకు ఉన్న రూ.8.38 కోట్లతో నిర్మించనున్న 11.2 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఓజిలి మండలంలోని చిల్లమానుచేను వద్ద ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఓజిలి, నాయుడుపేట ఎంపీపీలు గడ్డం అరుణమ్మ, కురుగొండల్ల ధనలక్ష్మి, చిల్లమానుచేను సర్పంచి సాయిరామ్, వైసీపీ మండల కన్వీనరు పాదర్తి హరినాథరెడ్డి, వైసీపీ నాయకులు మధుసూదనరెడ్డి, హరినాథరెడ్డి, ముమ్మడి సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లైమ్‌లను పరిష్కరించండి

తడ, మార్చి 7: ఓటరు జాబితా పెండింగ్ క్లైమ్‌లను వెంటనే పరిష్కరించాలని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశం జరిగింది. మండలంలోని 43 పోలింగ్ కేంద్రాల పరిధిలో తప్పులకు తావులేకుండా అన్ని క్లైమ్‌లన్ని సోమవారంలోపు పరిష్కరించాలని అన్నారు. ఎన్నికలు అయ్యే వరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అనంతరం తహసీల్దారు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట డీటీ శరత్‌బాబు ఉన్నారు.

12న రక్త శిబిరం ఏర్పాటు

వెంకటగిరిటౌన్, మార్చి 7: వెంకటగిరి ఐటీఐ కళశాల వద్ద ఈ నెల 12వ తేదీన రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ సుజన్‌కుమార్ గురువారం తెలిపారు.

వైసీపీ ఆధ్వర్యంలో మైనార్టీ సదస్సు

గూడూరు, మార్చి 7: స్థానిక సనత్‌నగర్‌లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో మైనార్టీ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పొనకా దేవసేనమ్మ, చేవూరు విజయమోహన్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, బత్తిని విజయ్ కుమార్, మగ్దూం తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట, మార్చి 7: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఆక్సీయాన్-2024 జాతీయస్థాయి సాంకేతిక విద్యాసదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఆది నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నాయుడుపేటలో పోలీసు కవాతు

నాయుడుపేట, మార్చి 7: పట్టణంలో బీఎస్ఎఫ్ దళాలతో కలసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల దృష్ట్యా నాయుడుపేట డీఎస్పీ కార్యాలయానికి 90మంది బీఎస్ఎఫ్ జవాన్లను కేటాయించారు. గురువారం అంబేడ్కర్ విగ్రహం నుంచి పట్టణ పురవీధుల్లో బీఎస్ఎఫ్ దళాలతో కలసి పోలీసులు కవాతు నిర్వహించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బాలాయపల్లి, మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అంగన్వాడీ పర్యవేక్షకురాలు రాజేశ్వరి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పొదుపు సంఘాల మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు ఇందిరా, మంజుల, శ్రీను, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి మండల సమావేశం

ఓజిలి, మార్చి 7: ఓజిలి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన గురువారం జరిగింది. విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, అంగన్వాడీ, పంచాయతీరాజ్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు నాంచారయ్య, కుందాం సొసైటీ అధ్యక్షుడు ఎద్దల రాజారామిరెడ్డి, అధికారులు, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

చిత్రపటం బహూకరణ

వెంకటగిరిటౌన్, మార్చి 7: వెంకటగిరికి చెందిన పోలిశెట్టి శంకర్ బాబు స్వర్ణభారత్ ట్రస్టులో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడిని గురువారం కలిశారు. ఆయన చిత్రపటాన్ని పెన్సిల్‌తో గీసి బహూకరించారు.

వైభవంగా ధ్వజారోహణం

నాయుడుపేట టౌన్, మార్చి 7: నాయుడుపేట స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో మంగళవాయిద్యాల, మంత్రోచ్చారణల నడుమ వేదపండితులు ధ్వజారోహణం నిర్వహించి శివరాత్రి మహోత్సవాలను ప్రారంభించారు. ఆలయ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, బాలాజీస్వామి, ఉగ్గుముడి భాస్కర్ రెడ్డి, అంకయ్య, అవధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపులో భాగంగానే పోలీసు సోదాలు

గూడూరు, మార్చి 7: రాజకీయ కక్షసాధింపుల్లో భాగంగానే జనసేన సిబ్బంది నివసించే ప్రాంతాల్లో పోలీసులు సోదాలు చేశారని పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక జనసేన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరిలో జనసేన పార్టీకి పనిచేసే సిబ్బంది నివసించే ప్రాంతాలపై పోలీసులు సోదాలు చేసి అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. బుధవారం అర్ధరాత్రి పోలీసులు అపార్ట్‌మెంటులోకి చొరబడి గంజాయి పొట్లాలు పెట్టి అక్రమ కేసులు పెట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. జనసేన సిబ్బంది వీడియోలు తీయకుంటే తాడేపల్లి ప్యాలెస్ కుట్రను అమలు చేసేవారన్నారు. కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న వైసీపీ పతనం మొదలైందని, వచ్చే ఓటమి తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, విజయ్, వంశీకృష్ణ, అవినాష్, సనత్, పెంచలయ్య, సాయికిరణ్, నాని తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

గూడూరు, మార్చి 7: స్థానిక కోర్టుసెంటర్‌లోని ఓ కూల్‌డ్రింక్స్ దుకాణంలో అక్రమంగా నిల్వవుంచిన 152 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని దుకాణం యజమానిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ ఏఈఎస్ రమేష్ తెలిపారు. స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక కోర్టు సెంటర్‌లో షఫీ అనే ఓ వ్యక్తి కూల్‌డ్రింక్స్ దుకాణం నిర్వహిస్తున్నాడని, అందులో విక్రయానికి సిద్ధంగా ఉంచిన 152 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీఐ రమేష్, ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గూడూరు అర్బన్, మార్చి 7: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకు డాక్టర్లు షరీనా, రేణుకాదేవి, ప్రసూన, సిబ్బంది విజయ, విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రహాస్, డాక్టర్ రాజా, సందీప్, జీ.చంద్రశేఖర్, కరిముల్లా, కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెళ్లకూరు, మార్చి 7: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండలంలోని పెన్నేపల్లి 71వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు... చావాలి చెక్‌పోస్టుకు చెందిన ఎస్ బాబుల్‌రెడ్డి మోటార్ బైక్‌పై నాయుడుపేటకు వెళ్తుండగా పెన్నేపల్లి పీఎంకే పెట్రోల్ బంకు వద్ద టిప్పర్ ఢీకొంది. బాబుల్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని స్విమ్స్‌కు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు

కోట, మార్చి 7: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి సెట్-2 ప్రశ్నపత్రాలు గురువారం కోట పోలీస్ స్టేషన్‌కు చేరాయి. డిపార్ట్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో ఆయా పశ్నపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ నెల 18నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే.

తడ: పదో తరగతి ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. 6 సబ్జెక్టులకుగాను 7 పరీక్షలు ఉంటాయని, వాటికి సంబంధించి రెండు సెట్ల ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పెళ్లకూరు: పదో తరగతి పరీక్షలు ఈ 18 నెల తేదీ ప్రారంభం కానుండగా, వాటికి సంబంధించిన ప్రశ్నపత్రాలు గురువారం పోలీస్‌స్టేషన్‌కు చేరాయి.

ముగిసిన మల్లెపూల సాగు శిక్షణ

కోట, మార్చి 7: మండల పరిధిలోని కేశవరంలో మల్లెపూల సాగుపై మహిళా రైతులకు మూడు రోజులపాటు జరిగిన శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. సేవ్‌ది చిల్డ్రన్ సంస్థ ఆధ్వర్యంలో నోక్కియా సంస్థ సహకారంతో శిక్షణ ఇచ్చారు. మల్లెపూల సాగులో అధునాతన పద్ధతులు చీడపీడల నివారణ, సాగు విస్తీర్ణం తదితర అంశాల గురించి వివరించారు. బాల్‌రక్షా భారత్ అసిస్టెంట్ మేనేజర్ రంగనాథన్, అగ్రికల్చర్ అసిస్టెంట్ సాయిమహేష మల్లెపూల సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే పిచికారి వ్యవస్థలో డ్రోన్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా తక్కువ పెట్టుబడులతో ఎక్కువ మల్లెల దిగుబడి పై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సేవ్‌ద చిల్డ్రన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు, మార్చి 7: చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని డాక్టర్ రోహిణి అన్నారు. గురువారం స్థానిక సీఎస్ఎం పాఠశాలలో రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడాకారిణీలకు క్రీడాదుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలురతో సమానంలో బాలికలు క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు. కార్యక్రమంలో సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, ఎస్ఎల్ఎన్ బాబు, నాశిన నాగులు, గిరిబాబు, కోట కృష్ణ, సుబ్రహ్మణ్యం, హెచ్ఎం శ్రీనివాసులు, పీఈటీ సుబ్రహ్మణ్యం, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య విలువ తెలుసుకోండి

నాయుడుపేట, మార్చి 7: విద్యార్థులు ఉన్నత విద్య విలువ తెలుసుకోవాలని నాయుడుపేట ఎంఈవో మునిరత్నం అన్నారు. స్థానిక కేకే కళ్యాణ మండపంలో గురువారం బాలభారతి వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ రాధాదేవి నిర్వహించారు. విద్యాభ్యాసంతో పాటు వివిధ అంశాల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బంగారు, వెండి, క్యాంస పతకాలు, సర్టిఫికెట్లు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.